PRGI Reg No -"APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి.... చదివించండి...

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 175 సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, శనివారం - 15 - ఆగష్టు - 2026 , వెల రూ.5/-

## వికసిత భారత్, ఆపరేషన్ సిందూర్, పేపర్ లీక్ లు..

### జాతినుద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగం



- 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవం - జాతిని ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి
- 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధనకు సమష్టిగా కృషి చేయాలని పిలుపు
- ఉగ్రవాదులకు 'ఆపరేషన్ సిందూర్' గట్టి సందేశం పంపిందన్న ముర్ము
- పరీక్షల విధానంలో పారదర్శకతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ

▸▸2

## రాష్ట్రపతి ప్రసంగం దేశ బలానికి నిదర్శనం : ప్రధాని మోదీ



- స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంపై రాష్ట్రపతికి ప్రధాని మోదీ ప్రశంసలు
- రాష్ట్రపతి ప్రసంగం దేశ సుస్థిరతను ప్రతిబింబిస్తోందన్న ప్రధాని
- గత పదేళ్లలో సాధించిన అభివృద్ధిని ప్రస్తావించిన రాష్ట్రపతి
- మహిళలు, యువత, పేదల సంక్షేమ పథకాలపై ప్రత్యేక ప్రస్తావన

▸▸2

# యుద్ధప్రాతిపదికన పోలవరం పనులు

### సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు



**నేటి శుభోదయ, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో కీలకమైన సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ సహా రాష్ట్రంలోని ప్రాధాన్యతా ప్రాజెక్టుల పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల వారీగా జరుగుతున్న పనుల వివరాలను జలవనరుల శాఖ అధికారులు ఆయనకు నివేదించారు. పోలవరం ప్రాజెక్టులో నిన్నటి వరకు 89.9 శాతం సివిల్ పనులు పూర్తయ్యాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఎడమ కాలువ పనులు యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయని, ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ గ్యాప్-1, గ్యాప్-2 పనులను శరవేగంగా చేపట్టినట్లు తెలిపారు. ఇటీవల 14 లక్షల క్యూసెక్కుల భారీ వరద ప్రవాహం వచ్చినప్పటికీ, పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా కొనసాగించామని నివేదికలో పేర్కొన్నారు. పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, పలు కీలక సూచనలు చేశారు. డ్యామ్ సైట్ వద్ద రోడ్ల వంటి మౌలిక వసతుల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా, ప్రాజెక్టు సమీపంలోని గండి పోశమ్మ ఆలయాన్ని పరిరక్షిస్తూ, స్థానికుల మనోభావాలను గౌరవించేలా కార్యాచరణ రూపొందించాలని..

- పోలవరం, వెలిగొండ ప్రాజెక్టుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- 89.9 శాతం మేర పోలవరం సివిల్ పనులు పూర్తయినట్టు వెల్లడి
- ప్రాధాన్యతా క్రమంలో 36 ప్రాజెక్టులు పూర్తి చేయాలని నిర్ణయం
- గండి పోశమ్మ ఆలయాన్ని పరిరక్షిస్తూ పనులు చేపట్టాలని ప్రత్యేక సూచన
- రాష్ట్రంలో వర్షపాతం, భూగర్భ జలాలపైనా సమావేశంలో చర్చ

▸▸2

## జగన్ పర్యటనలో హల్‌చల్.. వైసీపీ నేతలపై కేసులు

- జగన్ కర్నూలు పర్యటనలో గందరగోళం
- నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాటసానిపైనా కేసు
- పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 నిబంధనల ఉల్లంఘన
- వీడియో ఫుటేజీల ఆధారంగా నిందితుల గుర్తింపు

**నేటి శుభోదయ, కర్నూల్ :** వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కర్నూలు పర్యటన సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించి ఆందోళనలు చేపట్టిన పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరిలో నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి కూడా ఉన్నారు. కర్నూలు నాలుగో పట్టణ పోలీసులు ఈ మేరకు చర్యలు చేపట్టారు. జగన్ పర్యటన నేపథ్యంలో నగరంలో పోలీసు యాక్ట్ సెక్షన్ 30 అమల్లో ఉన్నప్పటికీ, వైసీపీ శ్రేణులు నిబంధనలకు విరుద్ధంగా భారీ ర్యాలీలు, రోడ్‌షోలు, బహిరంగ సభలు నిర్వహించారు. ఈ నిబంధనల అతిక్రమణపై స్పందించిన పోలీసులు సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. అలాగే, పర్యటనలో భాగంగా దిష్టిబొమ్మను దహనం .....



▸▸2

## డేటా సెంటర్లకు నీటి సరఫరాపై అది దుష్ప్రచారం మాత్రమే: సీఎం చంద్రబాబు

- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని చంద్రబాబు ఆదేశం
- లోటు వర్షపాతం దృష్ట్యా నీటిని పొదుపుగా వాడాలని అధికారులకు స్పష్టం
- పోలవరం, వెలిగొండ సహా 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని సూచన
- అన్నమయ్య ప్రాజెక్టు ఆయకట్టుకు నీరిచ్చే అంశంపై అధ్యయనం చేయాలని ఆదేశం



**నేటి శుభోదయ, అమరావతి :** రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్లకు భారీగా నీటిని కేటాయిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. అది కేవలం దుష్ప్రచారమేనని, డేటా సెంటర్ల పూర్తిస్థాయి అవసరాలకు కేవలం 3.5 టీఎంసీల నీరు మాత్రమే సరిపోతుందని స్పష్టం చేశారు. ఈ వాస్తవాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి అపోహలను తొలగించాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నెలకొన్న లోటు వర్షపాతం పరిస్థితుల దృష్ట్యా, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకే ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. నేడు సచివాలయంలో జలవనరుల శాఖ పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. వాటర్ మూవ్‌మెంట్ ప్లాన్‌కు అనుగుణంగానే నీటి నిర్వహణ చేపట్టాలని, రిజర్వాయర్లు, చెరువుల్లోని నీటి నిల్వలతో పాటు భూగర్భ జలాలను అత్యంత సమర్థంగా వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు.

## హద్దులు దాటొద్దు, భాష జాగ్రత్త!

### : జనసైనికులకు మరోసారి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం



**నేటి శుభోదయ, మంగళగిరి :** సోషల్ మీడియా వేదికగా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు అనుసరించాల్సిన వైఖరిపై జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మరోసారి కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. పార్టీ నేతలు, జనసైనికులు, వీర మహిళలు పోస్టులు పెట్టేటప్పుడు, వివిధ అంశాలపై స్పందించేటప్పుడు భాష విషయంలో సంయమనం పాటించాలని, పరిధి దాటవద్దని ఆయన స్పష్టంగా దిశానిర్దేశం చేశారు. అనవసర విషయాలపై ఇష్టానుసారం మాట్లాడటం, అసభ్య పదజాలం ఉపయోగించడం సరికాదని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో, ముఖ్యంగా కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న తరుణంలో పార్టీ ప్రతిష్ఠకు భంగం కలగకుండా వ్యవహరించాలని పవన్ కల్యాణ్ సూచించారు. ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియాలో మాట్లాడే సమయంలో పార్టీ .....

▸▸2

## ఆదిత్య-ఎల్1 అద్భుత పరిశోధన..

### - సూర్యుడి అతిపెద్ద రహస్యంపై కీలక ఆధారాలు!



సూర్యుడి కరోనా వేడి రహస్యంపై కీలక ఆధారాలు సేకరించిన ఆదిత్య ఎల్1

భారత్ తొలి సోలార్ మిషన్ పరిశోధనలో వెల్లడైన కొత్త విషయాలు

ఉపరితలం కన్నా వాతావరణం కొన్ని మిలియన్ డిగ్రీలు వేడిగా ఉండటానికి కారణాలపై అధ్యయనం

సౌర తుఫాన్ల తర్వాత శక్తి ఎలా భర్తీ అవుతుందో వివరించిన భారత శాస్త్రవేత్తలు

2

## 'రెడ్ లైన్' దాటితే వరల్డ్ మ్యాప్‌లోనే ఉండరు..

## పాకిస్థాన్‌కు భారత నేతల తీవ్ర హెచ్చరిక

- సింధు జలాల ఒప్పందంపై హెచ్చరించిన పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్
- ఇది తమ దేశానికి 'రెడ్ లైన్' అని వ్యాఖ్య
- తీవ్రంగా స్పందించిన భారత రాజకీయ పక్షాలు
- దుస్సాహసాలకు పాల్పడితే భూమండలంపైనే లేకుండా పోతారని ఘాటు హెచ్చరిక
- ఉగ్రవాదం ఆపేవరకు ఒప్పందం పునరుద్ధరణ అసాధ్యమని భారత్ స్పష్టం

**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** సింధు నదీ జలాల ఒప్పందం విషయంలో పాకిస్థాన్ చేసిన బెదిరింపు వ్యాఖ్యలపై భారత రాజకీయ నేతలు తీవ్రంగా స్పందించారు. ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా పాకిస్థాన్‌ను ప్రపంచ పటం నుంచే తుడిచిపెడతామని పార్టీలకతీతంగా నేతలు ముక్తకంఠంతో హెచ్చరించారు. సింధు జలాల అంశం తమ దేశానికి "రెడ్ లైన్" అని, ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన వ్యాఖ్యలకు భారత నేతలు .....



▸▸2

# జగన్ పర్యటనలో హల్‌చల్.. వైసీపీ నేతలపై కేసులు

**మొదటిపేజీ తరువాయి..** చేసిన వైసీపీ నేత సుభాష్ చంద్రబోస్ సహా ఆయన అనుచరులపై కూడా కేసు నమోదైంది. వీటితో పాటు, "గంగమ్మ జాతర" ప్లకార్డులను ప్రదర్శించిన కొందరు కార్యకర్తలను కూడా ఈ కేసుల్లో చేర్చారు. పర్యటనకు సంబంధించిన వీడియోలు, సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించిన మరికొంత మందిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు. ఈ పరిణామాలు స్థానిక రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి.

# ఆదిత్య-ఎల్1 అద్భుత పరిశోధన..

## - సూర్యుడి అతిపెద్ద రహస్యంపై కీలక ఆధారాలు!

**మొదటిపేజీ తరువాయి..** భారత అంతరిక్ష పరిశోధనలో ప్రతిష్ఠాత్మకమైన ఆదిత్య–ఎల్1 సౌర యాత్ర అద్భుతమైన ఫలితాలను అందిస్తోంది. సూర్యుడికి సంబంధించి దశాబ్దాలుగా అంతుచిక్కని ఓ అతిపెద్ద రహస్యాన్ని ఛేదించే దిశగా కీలక సమాచారాన్ని భారత శాస్త్రవేత్తలు కనుగొన్నారు. సూర్యుడి ఉపరితలం కన్నా దాని బాహ్య వాతావరణం (కరోనా) మిలియన్ల డిగ్రీల మేర అత్యంత వేడిగా ఎందుకు ఉంటుందనే మిస్టరీపై ఈ పరిశోధన కొత్త విషయాలను తెరపైకి తెచ్చింది. భారత్ మొట్టమొదటిసారిగా సూర్యుడిని అధ్యయనం చేసేందుకు ప్రయోగించిన ఆదిత్య–ఎల్1 నుంచి అందిన డేటాను విశ్లేషించిన శాస్త్రవేత్తలు ఈ వివరాలను వెల్లడించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ)కు చెందిన ప్రొఫెసర్ ఆర్. రమేశ్ నేతృత్వంలోని బృందం చేసిన ఈ అధ్యయన వివరాలు ప్రఖ్యాత 'ఆస్ట్రోఫిజికల్ జర్నల్ లెటర్స్'లో ప్రచురితమయ్యాయి. శాస్త్రవేత్తలను ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న ప్రశ్న.. సూర్యుడి ఉష్ణోగ్రత తీరు. సూర్యుడి కేంద్రంలో దాదాపు 1.5 కోట్ల డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటుంది. కానీ, మన కంటికి కనిపించే ఉపరితలం (ఫొటోస్ఫియర్) వద్ద కేవలం 5,500 డిగ్రీలు మాత్రమే ఉంటుంది. ఆశ్చర్యకరంగా, ఉపరితలానికి ఎంతో దూరంలో ఉండే బాహ్య వాతావరణమైన కరోనాలో ఉష్ణోగ్రత సుమారు 20 లక్షల డిగ్రీల సెల్సియస్ ఉంటుంది. కొన్నిసార్లు ఇది ఏకంగా 4 కోట్ల డిగ్రీలకు కూడా చేరుకుంటుంది. వేడి పుట్టే కేంద్రం నుంచి దూరంగా వెళ్లేకొద్దీ ఉష్ణోగ్రత తగ్గాల్సింది పోయి, ఇలా విపరీతంగా పెరగడం భౌతిక శాస్త్ర నిబంధనలకు విరుద్ధంగా అనిపించడంతో ఇది సౌర శాస్త్రంలో ఓ పెద్ద మిస్టరీగా మిగిలిపోయింది.

# హద్దులు దాటొద్దు, భాష జాగ్రత్త!

## జనసైనికులకు మరోసారి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం

**మొదటిపేజీ తరువాయి..** నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. రాజకీయ ప్రత్యర్థులు సోషల్ మీడియా ద్వారా పార్టీలో అంతర్గత విభేదాలు సృష్టించేందుకు చేసే ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వారి కుట్రలను తిప్పికొట్టాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. పార్టీ క్రమశిక్షణే అత్యంత కీలకమని, దానికి విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఈ ప్రకటన ద్వారా పార్టీ అధిష్ఠానం గట్టి హెచ్చరికలు పంపింది. ఇటీవల ఒంగోలులో టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జనసేన నేత బాలినేని శ్రీనివాసరెడ్డిల మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం నడిచిన నేపథ్యంలో, పవన్ కల్యాణ్ తాజా మార్గదర్శకాలు జారీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# యుద్ధప్రాతిపదికన పోలవరం పనులు..

**మొదటిపేజీ తరువాయి..** ఈ సమావేశంలో మొత్తం 36 ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయడంపై చర్చించారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు, లోటు వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి సరఫరా, జలధార–జలహారతి కార్యక్రమాల అమలు వంటి అనేక కీలక అంశాలపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# టీవీ యాడ్స్‌పై 12 నిమిషాల పరిమితి ఎత్తివేత..

## - కేంద్రం కీలక నిర్ణయం



**మొదటిపేజీ తరువాయి..** టెలివిజన్ ఛానెళ్ల ప్రసారాల్లో ప్రకటనల సమయంపై ఉన్న కీలక నిబంధనను కేంద్ర ప్రభుత్వం తొలగించింది. గంటకు 12 నిమిషాలు మాత్రమే ప్రకటనలు ప్రసారం చేయాలన్న పరిమితిని ఎత్తివేస్తూ శుక్రవారం నిర్ణయం తీసుకుంది. టీవీ, డిజిటల్ మీడియా మధ్య సమాన పోటీని ప్రోత్సహించడం, వ్యాపార సౌలభ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకున్నట్లు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. 1994 నాటి కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్ నిబంధనల కింద 2006లో ఈ 12 నిమిషాల ప్రకటనల పరిమితిని ప్రవేశపెట్టారు. అయితే, అప్పటి నుంచి ఇప్పటివరకు టీవీ ప్రసార రంగంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయని మంత్రిత్వ శాఖ వివరించింది. 2006లో దేశంలో కేవలం 62 టీవీ ఛానెళ్లు మాత్రమే ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 900కు పైగా ఉందని గుర్తు చేసింది. ఆ రోజుల్లో అనలాగ్ పద్ధతిలో ఉన్న కేబుల్ టీవీ ప్రసారాల వల్ల ఛానెళ్ల సంఖ్య పరిమితంగా ఉండేది. కానీ, ఇప్పుడు కేబుల్ టీవీ రంగం పూర్తిగా డిజిటలైజ్ అయింది. డీటీహెచ్, కేబుల్ టీవీ, ఐపీటీవీ వంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు 300 నుంచి 500కు పైగా ఛానెళ్లను అందిస్తూ ప్రేక్షకులకు విస్తృత ఎంపికలు కల్పిస్తున్నాయి.

# వికసిత భారత్, ఆపరేషన్ సిందూర్, పేపర్ లీక్ లు..

## - జాతినుద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగం

**మొదటిపేజీ తరువాయి..** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం సాయంత్రం జాతినుద్దేశించి ప్రసంగించారు. గడిచిన దశాబ్దంలో ప్రపంచ అనిశ్చితుల మధ్య కూడా దేశం వేగవంతమైన, సమ్మిళిత వృద్ధిని సాధించిందని కొనియాడారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు దేశ ప్రజలంతా సమష్టిగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న కఠిన వైఖరిని, అంతర్గత భద్రతలో సాధించిన విజయాలను, ఆర్థిక ప్రగతిని ఆమె తన ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావించారు. ఉగ్రవాదులు, వారికి ఆశ్రయం కల్పిస్తున్న దేశాలపై భారత్ తీసుకున్న నిర్ణయాత్మక చర్యలను రాష్ట్రపతి ప్రశంసించారు. 'ఆపరేషన్ సిందూర్', సింధు జలాల ఒప్పందం నిలిపివేత వంటివి చరిత్రాత్మక నిర్ణయాలని అభివర్ణించారు. "ఆపరేషన్ సిందూర్ మన సైనిక దళాల అసమాన పరాక్రమానికి నిదర్శనం. ఉగ్రవాదంపై భారత సైన్యం ఎంత కచ్చితత్వంతోనైనా చర్యలు తీసుకోగలదని ఈ ఆపరేషన్ నిరూపించింది. ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా, వారి చర్యల పర్యవసానాలను ఎదుర్కోక తప్పదని ఇది గట్టి సందేశం పంపింది" అని ఆమె స్పష్టం చేశారు. ఉగ్రవాదానికి ఆశ్రయం కల్పిస్తున్న దేశంతో సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం దేశ ప్రయోజనాల రీత్యా, ముఖ్యంగా రైతుల శ్రేయస్సు దృష్ట్యా తీసుకున్న కీలకమైన ముందడుగు అని తెలిపారు. గడిచిన పదేళ్లలో దేశం "వికాస్, విరాసత్" (అభివృద్ధి, వారసత్వం) రెండింటినీ సమన్వయం చేసుకుంటూ వేగంగా పురోగమించిందని రాష్ట్రపతి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా 25 కోట్లకు పైగా ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక సమ్మిళిత పథకమైన 'ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన' కింద దాదాపు 59 కోట్ల మంది బ్యాంకు ఖాతాలు తెరిచారని, వీరిలో 32 కోట్లకు పైగా మహిళలు ఉన్నారని వివరించారు. మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించడం వల్ల పెట్టుబడులు ఆకర్షించడమే కాకుండా, ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయని ఆమె పేర్కొన్నారు. ఇటీవల జరిగిన పేపర్ లీక్ ఘటనలను ప్రస్తావిస్తూ, పరీక్షా వ్యవస్థలో అవకతవకలను అరికట్టి పారదర్శకతను పాటిస్తామని ప్రభుత్వం కృషి చేస్తోందని యువతకు భరోసా ఇచ్చారు. దేశ జనాభాలో 65 శాతం ఉన్న 35 ఏళ్లలోపు యువతే స్టార్టప్ వ్యవస్థకు చోదక శక్తిగా నిలుస్తోందని, దేశ ఉజ్వల భవిష్యత్తుకు వారే సారథులని కొనియాడారు. మహిళా రిజర్వేషన్ చట్టం ద్వారా రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం పెరిగి ప్రజాస్వామ్య పునాదులు బలపడుతున్నాయని అన్నారు. క్రీడల నుంచి రక్షణ రంగం వరకు మహిళలు సాధిస్తున్న విజయాలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. దేశంలో మావోయిజం అంతం కావడం ఒక చారిత్రాత్మక విజయమని రాష్ట్రపతి అభివర్ణించారు.

# రాష్ట్రపతి ప్రసంగం దేశ బలానికి నిదర్శనం : ప్రధాని మోదీ

**మొదటిపేజీ తరువాయి..** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతినుద్దేశించి చేసిన ప్రసంగంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. రాష్ట్రపతి ప్రసంగంలోని ఆలోచనలు దేశ బలానికి, ప్రతి భారతీయుడి ఆకాంక్షలకు నిదర్శనమని ఆయన కొనియాడారు. శుక్రవారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ప్రధాని స్పందించారు. "స్వాతంత్ర్య దినోత్సవ వేళ రాష్ట్రపతి చాలా ఉత్తేజకరమైన, ఆలోచింపజేసే ప్రసంగం చేశారు. ఆమె ఆలోచనలు మన దేశ శక్తిని, ప్రతి భారతీయుడి ఆకాంక్షలను ప్రతిబింబిస్తాయి. వికసిత భారత్ నిర్మాణం కోసం పునరంకిత భావంతో పనిచేయడానికి ఆమె సందేశం మనందరికీ స్ఫూర్తినిస్తుంది" అని ప్రధాని తన పోస్టులో పేర్కొన్నారు. అంతకుముందు, తన ప్రసంగంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గత దశాబ్ద కాలంలో దేశం సాధించిన ప్రగతిని వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ, భారతదేశం వేగవంతమైన, సమ్మిళిత ఆర్థిక వృద్ధిని సాధించిందని తెలిపారు. "వికాస్ మరియు విరాసత్" (అభివృద్ధి, వారసత్వం) సమన్వయంతో దేశం ముందుకు సాగుతోందని అన్నారు. 'వికసిత భారత్ @ 2047' లక్ష్యాన్ని సాధించేందుకు ప్రజలందరూ సమష్టిగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలు, యువత, పేదలు, రైతుల సంక్షేమ పథకాలను రాష్ట్రపతి ప్రముఖంగా ప్రస్తావించారు. గత పదేళ్లలో 25 కోట్లకు పైగా ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని గుర్తుచేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక సమ్మిళిత పథకమైన 'ప్రధానమంత్రి జన్ ధన్ యోజన' కింద సుమారు 59 కోట్ల మంది బ్యాంకు ఖాతాలు తెరిచారని, వీరిలో 32 కోట్లకు పైగా మహిళలు ఉన్నారని వివరించారు. మహిళా రిజర్వేషన్ చట్టం ద్వారా రాజకీయాల్లో వారి భాగస్వామ్యం పెరిగిందని, ఇది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తోందని అన్నారు. ఇటీవల జరిగిన పేపర్ లీక్ ఘటనలను ప్రస్తావిస్తూ, పరీక్షా వ్యవస్థలో అవకతవకలను అరికట్టి, పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని యువతకు భరోసా ఇచ్చారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించడం వల్ల పెట్టుబడులు పెరిగి, ఉద్యోగ అవకాశాలు మెరుగయ్యాయని తెలిపారు. దేశ జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్లలోపు వారేనని, వారి శక్తితో స్టార్టప్ వ్యవస్థ దేశ స్వర్ణ భవిష్యత్తుకు బాటలు వేస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రపంచ యవనికపై భారత్‌ను అగ్రగామిగా నిలబెట్టేందుకు పౌరులందరూ తమ వంతు కృషి చేయాలని రాష్ట్రపతి తన ప్రసంగంలో పిలుపునిచ్చారు.

# 'రెడ్ లైన్' దాటితే వరల్డ్ మ్యాప్‌లోనే ఉండరు..

## పాకిస్థాన్‌కు భారత నేతల తీవ్ర హెచ్చరిక

**మొదటిపేజీ తరువాయి..** గట్టిగా బదులిచ్చారు. పాకిస్థాన్ తన గడ్డపై నుంచి ఉగ్రవాదాన్ని పూర్తిగా తుడిచిపెట్టేంత వరకు సింధు జలాల ఒప్పందం నిలిపివేతలోనే ఉంటుందని భారత్ ఎప్పటినుంచో స్పష్టం చేస్తోంది. ఈ విషయంపై ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో మాట్లాడిన కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్, "భారత్ తన జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగానే పనిచేస్తుంది. అసలు పాకిస్థాన్ స్థాయి ఎంత? ప్రపంచంలో ఏ శక్తి ఉన్నా సరే.. మేము మా ప్రయోజనాల కోసమే పనిచేస్తాం, వాటిని దృఢంగా కాపాడుకుంటాం" అని తేల్చిచెప్పారు. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆర్.పి. సింగ్ పాకిస్థాన్‌ను విమర్శిస్తూ, "గతేడాది జరిగిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్ పరిస్థితి ఏమైందో షెహబాజ్ షరీఫ్ మరిచిపోయి ఉండొచ్చు. వారి ఉగ్రవాద మౌలిక సదుపాయాలు, విమానాశ్రయాలు ఎలా ధ్వంసమయ్యాయో గుర్తు చేసుకోవాలి. ఇప్పుడు ఎలాంటి దుస్సాహసానికి ప్రయత్నించినా, పాకిస్థాన్ ప్రపంచ పటం నుంచే శాశ్వతంగా కనుమరుగవుతుంది" అని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. కాంగ్రెస్ ఎంపీ తారిఖ్ అన్వర్ కూడా ఇదే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "భారత్ ఈ ఒప్పందాన్ని నిలిపివేయడానికి బలమైన కారణం ఉంది. పాకిస్థాన్ వైపు నుంచి ఉగ్రవాద కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఇటీవల కశ్మీర్‌లో అమాయకుల ప్రాణాలను బలిగొన్న దాడుల నేపథ్యంలో, పాకిస్థాన్‌తో సంబంధాలు కొనసాగించడం భారత్‌కు చాలా కష్టం" అని ఆయన వివరించారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ మాట్లాడుతూ, "'ఆపరేషన్ సిందూర్'లో మన భారత సైన్యం వారికి ఎరుపు, పసుపు, నీలం.. అన్ని రకాల లైన్లను ఎలా చూపించిందో మీరు చూసే ఉంటారు. కాబట్టి, పాకిస్థాన్ చెప్పేది భారత్ సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు. వారు చేసే ప్రతి పనికి వెయ్యి రెట్ల బలంతో గట్టి సమాధానం చెప్పే సామర్థ్యం భారత్‌కు ఉంది. ఈ విషయంలో యావత్ దేశం భారత ప్రభుత్వానికి, భారత సైన్యానికి అండగా నిలుస్తుంది" అని ఐఏఎన్ఎస్‌కు తెలిపారు.

# 22 కి.మీ. రోడ్డుకు రూ. 1,519 కోట్ల ఖర్చు చూపిస్తున్నారు : అంబటి రాంబాబు



**నేటి శుభోదయ, అమరావతి :** అమరావతి రాజధాని నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన పేరుతో కూటమి ప్రభుత్వం భారీగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, అమరావతి అనేది అద్భుత నగరం ఎంతమాత్రం కాదని అన్నారు. అది కేవలం అవినీతి, దోపిడీకి నిలయంగా మారిందని విమర్శించారు. రాజధాని నిర్మాణాలు ఎప్పటికీ పూర్తి కావని... తాత్కాలిక భవనాలు, స్టీల్ బ్రిడ్జిల పేరుతో అప్పులు చేసి మరీ వేల కోట్ల రూపాయలు తగలేస్తున్నారని అంబటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా రహదారుల నిర్మాణంపై తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తూ, 22 కిలోమీటర్ల రోడ్డుకు రూ. 1,519 కోట్ల ఖర్చు చూపిస్తున్నారని విమర్శించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కిలోమీటర్ రోడ్డుకు రూ. 180 కోట్లు ఖర్చు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు సరైన న్యాయం జరగలేదని, కమీషన్ల కోసమే అంచనాల బడ్జెట్‌ను పెంచుకుంటూ పోతున్నారని మండిపడ్డారు.

# చింతూరులోనే వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలి





**చింతూరు, ఆగస్టు 14, నేటి శుభోదయ :** చింతూరు మండలంలో జూలై నెల నుంచి వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు నిలిపివేయడంతో ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాలకు చెందిన వాహనదారులు ఫిట్‌నెస్ కోసం రాజమండ్రికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫిట్‌నెస్ పరీక్షల కోసం రాజమండ్రికి వెళ్లాలంటే సుమారు 140 కిలో మీటర్లు ప్రయాణించడంతో పాటు, తిరిగి మరో 140 కిలోమీటర్లు రావాల్సి వస్తోందని ఆటో యూనియన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఘాట్‌రోడ్డు మార్గంలో ప్రయాణించాల్సి ఉండటంతో సమయం, ఇంధన ఖర్చులతో పాటు వాహనదారులకు అదనపు భారం పడుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో చింతూరు మండలంలోని ఆటో యూనియన్ సభ్యులు కలిసి ఆర్టీఓ కార్యాలయంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ చల్లారావును కలిసి తమ సమస్యలను వివరించారు. చింతూరు సబ్ డివిజన్ పరిధిలోనే వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశారు. చట్టి, చింతూరు, చిరుమూరు తదితర ప్రాంతాలకు చెందిన ఆటో యూనియన్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని, స్థానికంగానే ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించడం ద్వారా నాలుగు మండలాల వాహనదారులకు ప్రయోజనం కలుగుతుందని కోరారు.

# అకాడమిక్ ఇన్స్పెక్టర్స్ నియామకం కొరకు దరఖాస్తు చేయండి : ఎంఈఓ వెంకటేశ్వర్లు

**చింతూరు, ఆగస్టు 14, నేటి శుభోదయ :** చింతూరు మండలంలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను 2026–27 విద్యాసం!!కు గాను అకాడమిక్ ఇన్స్ట్రక్చర్స్ తో పోస్టులు భర్తీ చేయడానికి కమిషనర్ పాఠశాల విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేశారు .ఆసక్తిగల అభ్యర్థులు క్రింద తెలపబడిన పోస్టులకు ఆగస్టు 16వ తేదీ నుండి 21వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించవచ్చునని తెలిపారు .పోస్టుల వివరాలు: స్కూల్ అసిస్టెంట్ ఆంగ్లము ( ఎస్ ఏ ఇంగ్లీష్ )1, సెకండరీ గ్రేడ్ ( ఎస్ జి టి) 15 పోస్టులు,, ఖాళీల వివరాలు ఎంపీపీఎ స్ నరసింగ పేట ఎస్ జి టి 1ఎంపీపీఎ స్ దొంగల జగ్గారం ఎస్ జి టి 1ఎంపీపీఎ స్ అల్లిగూడెం. ఎస్ జి టి 1ఎంపీపీఎ స్ లంకపల్లి ఎస్ జి టి 1ఎంపీపీఎ స్ సురకుంట ఎస్ జి టి 1ఎంపీపీఎ స్ గంగాన మెట్ట ఎస్ జి టి 1ఎంపీపీఎ స్ లచ్చిగూడెం ఎస్ జి టి 1ఎంపీపీఎ స్ వంక గూడెం ఎస్జీటీ 1ఎంపీపీఎ స్ జువ్వి గూడెం ఎస్ జి టీ 1ఎంపీపీఎ స్ కొత్తపల్లి ఎస్ జి టి 1ఎంపీపీఎ స్ నేలకోట ఎస్ జి టి 1ఎంపీపీస్ సుకుమామిడి ఎస్ జి టి 1ఎంపీపీఎ స్ పొల్లురూ ఎస్ జి టి 1ఎంపీపీఎ స్ పావురులంక ఎస్ జి టి 1ఎంపీపీఎ స్ ఉలుమూరు ఎస్ జి టి 1 జడ్.పి.హెచ్.ఎస్ చింతూరు యస్ ఎ ఇంగ్లీష్ 1అని తెలిపిన విధంగా ఖాళీలు పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్స్ తో భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు.దరఖాస్తు చేయుటకు గడువు తేదీ 16 ఆగస్టు 2026 నుండి 21 ఆగస్టు 2026 వరకు స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందజేయవలెనని ఎంఈఓ వెంకటేశ్వర్లు ఒక ప్రకటన లో



తెలిపారు.

# హర్ ఘర్ తిరంగా' ర్యాలీలో పాల్గొని మూడు చక్రాల మోటారు బైక్ నడిపిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

**నంద్యాల, ఆగస్టు 14, నేటి శుభోదయ :** నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో శుక్రవారం 'హర్ ఘర్ తిరంగా' భారీ ర్యాలీ నిర్వహించారు. నందికొట్కూరు పట్టణంలో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీలో శారీరక వైకల్యాన్ని ఏమాత్రం లెక్క చేయకుండా దివ్యాంగులు ఉత్సహంగా జాతీయ జెండాలతో ర్యాలీలో పాల్గొనడం సంతోషంగా ఉందని, వారిని ఉత్సహపరుస్తూ మూడు చక్రాల బైక్ ను ర్యాలీలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి నడిపారు. పలు విద్యాసంస్థల నుండి భారీగా తరలి వచ్చిన విద్యార్థులతో కలిసి నంద్యాల ఏం.పై.బైరెడ్డి శబరి. మూడు రంగుల జాతీయ జెండాలను చేతబూని విద్యార్థులను ఉత్సాహ పరుస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రారంభమై, నంద్యాల రోడ్డు మీదుగా ర్యాలీ సర్దార్ వల్లభాయ్ పటేల్ సెంటర్ వద్దకు చేరుకుని పటేల్ విగ్రహానికి పూలమాల వేసి, జాతీయగీతాన్ని ఆలపించారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబ్దం మాట్లాడుతూ వార్.. ఘర్ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటా మూడు రంగుల జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి, జాతీయ



సమైక్యతా భావాలను చాటాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన ఎందరో మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలని, యువతలో దేశభక్తి స్ఫూర్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ జెండా పట్ల గౌరవాన్ని చాటాలని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ దేశ ఐక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగేశ్వరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ దాసి. సుధాకర్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్. కాకరవాడ చిన్న వెంకటస్వామి, టీడీపీ నాయకులు, మురళీధర్ రెడ్డి, రఘురామిరెడ్డి, గుణశేఖర్ రెడ్డి, బంగారు వెంకటేశ్వర్లు,, ఆంధ్ర



ప్రగతి విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు, వికలాంగుల సంఘం నాయకులు మాధసి ఎల్లప్ప విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎంపీ నిధులతో ఓపెన్ ఎయిర్ జిమ్ లను ప్రారంభించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



**నంద్యాల, ఆగష్టు 14, నేటి శుభోదయ :** నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలో నంద్యాల పార్లమెంట్ నిధులు రూ. 50 లక్షల ఖర్చు తో , గేల్ ఇండియా ఆధ్వర్యంలో ఓపెన్ ఎయిర్ ఆరు జిమ్ లను నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి శుక్రవారం ప్రారంభించారు.నందికొట్కూరు పట్టణం కోటవీధి లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గేల్ ఇండియా లిమిటెడ్ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సి ఎస్ఆర్) కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఆరు ఓపెన్ ఎయిర్ జిమ్‌ను నంద్యాల జిల్లా ఎంపీ బైరెడ్డి శబరి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఓపెన్ ఎయిర్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగేశ్వర రావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, మాజీ మున్సిపల్ చైర్మన్ డి. సుధాకర్ రెడ్డి, టీడీపీ నాయకులు మోటు మురళీధర్ రెడ్డి, రఘురాంరెడ్డి గుణశేఖర్ రెడ్డి, బంగారు వెంకటేశ్వర్లు, కళాశాల అధ్యాపకులు, గేల్ ఇండియా ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాల్గొన్నారు.

# బేబీ మూన్ పాఠశాలలో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్



**ఖమ్మం, ఆగష్టు 14, నేటి శుభోదయ :** నగరంలోని బేబీ మూన్ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ కేసా సుగుణ, కేసా కళ్యాణి ఉదయం 10 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ ఫుడ్ స్టాల్స్‌లో స్వదేశీ, విదేశీ రుచులతో కూడిన అనేక రకాల వంటకాలను ప్రదర్శించారు. నేటి యువత ఫాస్ట్‌ఫుడ్ వంటకాలైన బర్గర్, పిజ్జా, ఫ్రెంచ్ ఫ్రైస్, నూడిల్స్, పానీపూరి వంటి వాటికి అలవాటు పడుతూ



సంప్రదాయ ఆహారమైన చద్దన్నం, గంజి, రాగులు, సజ్జలు, చిరుధాన్యాలను దూరం చేసుకుంటున్నారని, సంప్రదాయ ఆహారపు అలవాట్ల వైపు యువతను మళ్లించేందుకు ఫుడ్ ఫెస్టివల్ దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కేసా భాస్కర్ మాట్లాడుతూ వివిధ రకాల రుచికరమైన వంటకాలను ఒకే వేదికపై ప్రదర్శించడం ద్వారా ఆహారంతో పాటు వివిధ సంస్కృతులను పరిచయం చేయవచ్చన్నారు. కొత్త రుచులు, విభిన్న సంస్కృతులు ప్రజలను కలుపుతూ ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రతి వంటకం వెనుక ఉన్న సంప్రదాయం, చరిత్రను తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. సంగీతం, నృత్యం, ఆటపాటలతో ఫుడ్ ఫెస్టివల్ ఉత్సాహభరితంగా సాగిందని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని వివిధ రకాల వంటకాలను ఆస్వాదిస్తూ ఆనందంగా గడిపారు.

# ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి వేగవంతం ఎమ్మెల్యే బొలిశెట్టి




**తాడేపల్లిగూడెం, ఆగస్టు 14, నేటి శుభోదయ :**
ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి వేగవంతమవుతుందని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు . తాడేపల్లిగూడెం హౌసింగ్ బోర్డ్ కాలనీలో దాతల సహకారంతో అభివృద్ధి చేసిన ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తే ప్రభుత్వంపై భారం తగ్గడం తోపాటు విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించవచ్చని అన్నారు. హౌసింగ్ బోర్డులోని మున్సిపల్ ప్రైమరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పార్కును, పిల్లల ఆట వస్తువులను ఆయన పరిశీలించారు.పాఠశాలలో పార్క్ ఏర్పాటు చేసి విద్యార్థులకు ఆట వస్తువులు అందించిన అంజన హరికృష్ణ, ఆయన మిత్రబృందం ఇంజనీర్ ఫౌండేషన్ సభ్యులను ఎమ్మెల్యే బొలిశెట్టి అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపడుతున్న పీ4 కార్యక్రమాలకు ప్రజలు స్వచ్ఛందంగా సహకరించడం అభినందనీయమన్నారు.ప్రభుత్వం అన్ని పాఠశాలలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలంటే ఎక్కువ సమయం పడుతుందని, ప్రజలు ముందుకు వచ్చి తమ పరిధిలోని పాఠశాలల అభివృద్ధికి సహకరిస్తే ప్రభుత్వ భారం తగ్గుతుందని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టే వారిని ప్రభుత్వం గుర్తించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన దుర్గాప్రసాద్‌ను పీ4లో సభ్యుడిగా గుర్తించి ఆయన వివరాలను ప్రభుత్వానికి పంపిస్తామని బొలిశెట్టి శ్రీనివాస్ వెల్లడించారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఎంపీ నిధులతో ఓపెన్ ఎయిర్ జిమ్ లను ప్రారంభించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

**నంద్యాల, ఆగస్టు 14, నేటి శుభోదయ :**
నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలో నంద్యాల పార్లమెంట్ నిధులతో, గేల్ ఇండియా ఆధ్వర్యంలో ఓపెన్ ఎయిర్ మూడు జిమ్ లను నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి శుక్రవారం ప్రారంభించారు.నందికొట్కూరు పట్టణం కోటవీధి లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గేల్ ఇండియా లిమిటెడ్ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సి ఎస్ఆర్) కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఓపెన్ ఎయిర్ జిమ్‌ను నంద్యాల జిల్లా ఎంపీ బైరెడ్డి శబరి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఓపెన్ ఎయిర్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక



కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, మాజీ మున్సిపల్ చైర్మన్ డి. సుధాకర్ రెడ్డి, టీడీపీ నాయకులు మోటు మురళీధర్ రెడ్డి, రఘురాంరెడ్డి గుణశేఖర్ రెడ్డి, బంగారు వెంకటేశ్వర్లు, కళాశాల అధ్యాపకులు, గేల్ ఇండియా ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాల్గొన్నారు.

# కృష్ణా డెల్టాకు సాగునీరు అందించకపోవడంపై అన్నదాతల ఆగ్రహం

**ఏలూరు, ఆగస్టు 14, నేటి శుభోదయ :** కృష్ణా డెల్టాకు సాగునీరు విడుదల చేయకపోవడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏలూరు పాత బస్టాండ్ సెంటర్ లో శుక్రవారం సాగునీటి కోసం రాస్తారోకో చేపట్టారు. ముందుగా వరి నారుతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు.కృష్ణా డెల్టాకు గోదావరి జలాలు అందించాలని, పంటల సాగుకు అవకాశం కల్పించాలని, రైతాంగాన్ని ఆదుకోవాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఏలూరు జిల్లా పరిధిలో ఏలూరు, పెదపాడు, దెందులూరు మండలాల్లోని 58వేల ఎకరాల కృష్ణా డెల్టా ఆయకట్టుకు గోదావరి జలాలు అందించే అవకాశం ఉన్నా ప్రభుత్వం,ఇరిగేషన్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గత 20 రోజులుగా రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఎకరాకు రూ.10 వేలు నుండి రూ.15 వరకు అప్పులు చేసి వరి నారుమళ్ళు, కొన్ని చోట్ల నాట్లు వేసారని చెప్పారు. అత్యధిక మంది సాగుదారులు కౌలు రైతులు, పేద రైతులేనన్నారు. కృష్ణా డెల్టాకు సాగునీరు ఇవ్వకపోతే రైతాంగం తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో గోదావరి నీళ్లను తెలప్రోలు వరకు కృష్ణా డెల్టాకు గోదావరి నీళ్లను అందించారని గుర్తు చేశారు. ఇప్పుడు ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. పట్టిసీమ నీళ్లను కృష్ణా డెల్టాకు ఇస్తున్నామని ముఖ్యమంత్రి సైతం ప్రకటిస్తున్నారని,కె.ఈ కెనాల్ కు నీరు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు.పోణంగి పుంత కాలువ ద్వారా ఏలూరు మండలం పరిధిలోని 10 వేల ఎకరాల కృష్ణా ఆయకట్టుకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. గోదావరి కాలువపై ఏలూరు తూర్పు లాకులు వద్ద మోటార్లు పెట్టి నీరు తోడి సాగునీరు అందించాలని కోరారు. రైతులు, కౌలు రైతులు వేసిన వరి నారుమళ్ళు, నాట్లు వేసిన చేలను కాపాడాలని,వరి సాగుకు అవకాశం కల్పించాలన్నారు.గోదావరి, కృష్ణా ప్రధాన కాలువల్లో నీరు పారుదల లేకపోవడం యుద్ధ ప్రాతిపదికన కాలువలు బాగు చేసే పనులు చేయించాలన్నారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కృష్ణా డెల్టాకు సాగునీరు






అందించే చర్యలు చేపట్టాలని కోరారు. సాగునీరు ఇచ్చేవరకు రైతుల పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

**కృష్ణా డెల్టా రైతులకు సీపీఎం మద్దతు**

సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్. లింగరాజు, నగర కార్యదర్శి పి.రవికుమార్ మాట్లాడుతూ సాగునీటి కోసం కృష్ణా డెల్టా రైతులు చేస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు. ప్రజాప్రతినిధులు,అధికారులు తక్షణం స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. రాస్తారోకో అనంతరం జిల్లా కలెక్టరేట్ వద్ద ఉన్న ఇరిగేషన్ ఎస్.ఈ కార్యాలయంలో ఉప పరివేక్షక ఇంజనీర్ పి. ధనుంజయులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణా డెల్టా రైతులు వాడపల్లి రామారావు, పైడిపాటి భాస్కరరావు, తలారి జయరాజు, చిన్ని పోతురాజు, మారుమూడి సువర్ణ రాజు, పుట్టి దుర్గాప్రసాద్, కొమ్మన సాంబశివరావు, కోన శ్రీనివాసరావు, బి.రాంబాబు,ఎం. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ నుంచి కాశీకి నేరుగా

- గన్నవరం నుంచి వారణాసికి ఇండిగో సర్వీసు ప్రారంభం
- వారానికి మూడు రోజులు, కాశీ యాత్రికులకు మరింత సౌకర్యం



**విజయవాడ, ఆగస్టు 14, నేటి శుభోదయ :**
కాశీ వెళ్లే ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభవార్త. విజయవాడ గన్నవరం విమానాశ్రయం నుంచి పవిత్ర పుణ్యక్షేత్రం వారణాసికి నేరుగా విమాన సర్వీసు అందుబాటులోకి వచ్చింది. ఇండిగో సంస్థ ఈ నూతన సర్వీసును ప్రారంభించింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వర్చువల్‌గా సర్వీసును ప్రారంభించారు.వారణాసి–విజయవాడ మధ్య విమానాలు మంగళవారం, గురువారం, శనివారం నడవనున్నాయి. దీంతో ఇప్పటివరకు ఇతర నగరాల్లో విమానాలు మార్చుకోవాల్సిన ప్రయాణికులకు నేరుగా కాశీ చేరుకునే అవకాశం లభించింది. ప్రయాణ సమయం తగ్గడంతో పాటు భక్తులకు మరింత సౌకర్యం కలగనుంది.ఆధ్యాత్మిక పర్యాటకానికి ఊతంవిజయవాడ నుంచి కాశీకి నేరుగా విమాన సర్వీసు అందుబాటులోకి రావడం ఆధ్యాత్మిక పర్యాటకానికి మరింత ఊతమిస్తుందని అధికారులు పేర్కొన్నారు. అమరావతి రాజధాని ప్రాంతంతో పాటు ఉమ్మడి కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాల ప్రజలకు ఈ సర్వీసు ప్రయోజనకరంగా ఉండనుంది.ప్రాంతీయ విమాన కనెక్టివిటీని బలోపేతం చేయడంతో పాటు టైర్–2, టైర్–3 నగరాలను ప్రధాన విమానాశ్రయాలతో అనుసంధానించడమే లక్ష్యమని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు.

# దేశభక్తిని పెంపొందించేందుకే హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**పుట్టపర్తి, ఆగస్టు 14, నేటి శుభోదయ :**
దేశభక్తి, జాతీయ సమైక్యత, దేశ ఐక్యతా స్ఫూర్తిని ప్రతి ఒక్కరిలో మరింతగా పెంపొందించేందుకే హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నామని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు.హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి నేతృత్వంలో పుట్టపర్తిలో శుక్రవారం భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది జాతీయ జెండాలను చేతబట్టి ర్యాలీలో పాల్గొని దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటిచెప్పారు.సత్యమ్మ ఆలయం వద్ద ప్రారంభమైన తిరంగా ర్యాలీ కర్ణాటక నాగేపల్లి బ్రిడ్జి, చిత్రావతి రోడ్డు, గణేష్ సర్కిల్, ఎయిర్‌పోర్టు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మామిళ్లకుంట క్రాస్, కొత్తచెరువు ఎన్టీఆర్ సర్కిల్, బుక్కపట్నం చెరువు కట్ట మీదుగా బుక్కపట్నం, జానకంపల్లి, కర్ణాటక నాగేపల్లి, చిత్రావతి బ్రిడ్జి మీదుగా తిరిగి సత్యమ్మ ఆలయం వరకు కొనసాగింది. ర్యాలీ మార్గమంతా జాతీయ జెండాలు రెపరెపలాడుతూ పుట్టపర్తిలో దేశభక్తి వాతావరణాన్ని నెలకొల్పాయి. 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' నినాదాలతో ర్యాలీ మార్మోగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ జాతీయ జెండా మన దేశ గౌరవానికి, ఐక్యతకు, త్యాగాలకు ప్రతీక అని అన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటుకోవడంతో పాటు, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, సైనికుల



త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధి, సమగ్ర ప్రగతి కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని ఆమె అన్నారు. యువతలో దేశభక్తి, జాతీయ బాధ్యతా భావాలను పెంపొందించడంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఎంతో ప్రాధాన్యత కలిగినదని పేర్కొన్నారు.ఈ భారీ ర్యాలీలో కూటమి ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పుర ప్రముఖులు, వివిధ వర్గాల ప్రజలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పుట్టపర్తి ప్రజలు స్వచ్ఛందంగా భారీగా తరలివచ్చి హర్ ఘర్ తిరంగా ర్యాలీకి ఘన స్వాగతం పలికారు.జాతీయ జెండాలను చేతబట్టి పుట్టపర్తి వీధుల్లో ప్రజలు ప్రదర్శించిన దేశభక్తి, జాతీయ సమైక్యత స్ఫూర్తి అందరినీ ఆకట్టుకుంది.

# స్వాతంత్ర దినోత్సవ పూర్తి నేటి తరానికి ఆదర్శం తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం, ఆగస్టు 14, నేటి శుభోదయ :**
దేశ స్వాతంత్రం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తాడేపల్లిగూడెం పట్టణంలో బిజెపి కూటమి పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా యాత్ర ర్యాలీని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ భారతమాతకు పుష్పాంజలి ఘటించి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల దాస్యశృంఖలాల నుంచి దేశాన్ని విముక్తి చేసేందుకు ఎందరో మహనీయులు త్యాగాలు చేశారని ఆయన నివాళులర్పించారు. స్వాతంత్ర ఉద్యమంలో తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన దంపతులు స్వాతంత్రోద్యమంలో ఎంతో సాహసమైన పాత్ర వహించారన్నారు. వీరితోపాటు గూడెం పట్టణానికి చెందిన పలువురు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. స్వతంత్ర ఉద్యమంలో పాల్గొన్న పట్టణానికి చెందిన మహనీయులు అసలు కృష్ణమూర్తి, ఆంజనేయలక్ష్మి, విగ్రహాలతో పాటు కన్నెగంటి హనుమంతు, అల్లూరి సీతారామరాజు అంటే అనేక మంది విగ్రహాలను ఇక్కడ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని నేటితరం ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం ప్రగతిఫదంలో పయనిస్తుందన్నారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి మాట్లాడుతూ స్వాతంత్రం ఉద్యమం తొలి దశలో కలకత్తా నగరం బిపిన్ చంద్రపాల్ ప్రజలందరినీ ఏకతాటిపైకి తెచ్చి స్వాతంత్రోద్యమ యజమాని మరింత వేగవంతం చేసేందుకు ప్రజలు గంగా నదిలో మునక వేసి వందేమాతరం అని నినదించాలని ఇచ్చిన పిలుపుమేరకు వందేమాతరం నినాదంతో కలకత్తా నగరం మారుమోగిందన్నారు. ఇది దేశవ్యాప్తంగా స్వాతంత్రోద్యమానికి స్ఫూర్తినిచ్చింది అన్నారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు అటు స్వాతంత్ర ఉద్యమంలోనూ స్వాతంత్ర అనంతరం నేటి వరకు వందేమాతర గీతం ఒక దివ్య మంత్రంగా స్ఫూర్తిదాయకమైందన్నారు. బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి ఈతకోట తాతాజీ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం త్యాగాలు చేసిన మహనీయుల స్ఫూర్తితో కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం 12 ఏళ్లుగా దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తుందన్నారు. అట్టడుగున ఉన్న భారతగా ఆర్థిక స్థాయిని నేడు ప్రపంచంలో మూడో స్థానానికి తీసుకు వెళ్లిన ఘనత నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని దన్నారు. మహనీయుల స్ఫూర్తితో నేటితరం ముందుకు సాగాలని కోరారు. బిజెపి నర్సాపురం పార్లమెంటరీ మీడియా ఇన్చార్జి నరిసే సోమేశ్వరరావు మాట్లాడితూ దేశ స్వాతంత్రం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగం ఫలితంగా నేడు భారతదేశం ప్రగతి పదంలో నడుస్తోందన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం దేశాన్ని అన్ని రంగాలలోనూ ఎంతో అభివృద్ధి చేస్తుందన్నారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం దేశ స్వాతంత్రం కోసం త్యాగాలు చేసిన మహనీయులను విలన్లుగా చిత్రీకరించే విధంగా పాఠ్యాంశాలు రూపొందించారని ధ్వజమెత్తారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దేశం కోసం త్యాగాలు చేసిన మహనీయుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి నేటి తరానికి భావితరాలకు వాటిని అందిస్తున్నారని పేర్కొన్నారు.బిజెపి పట్టణం అధ్యక్షులు దువ్వా శ్రీను మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని విద్యార్థులు యువత ప్రజల్లో నింపేందుకు ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుమేరకు పట్టణంలో తెలంగాణ నిర్వహించడం హార్షణీయమన్నారు. అభివృద్ధి సంక్షేమం కోసం విశేష కృషి చేస్తున్నాఎన్నారు.జనసేన పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశీ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం సుదీర్ఘకాలం ఎందరో మహనీయులు త్యాగాలు చేసి స్వాతంత్రం సాధించారన్నారు. నేడు నరేంద్ర మోడీ నాయకత్వంలోని డబుల్ ఇంజన్ సర్కార్ దేశాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తోందన్నారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పర్యావరణ పరిరక్షణకు విశేషకృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమం లోబిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోట రాంబాబు, గట్టెం నవీన్,పెదపోలు వీర రాఘవులు,తెలుగు దేశం నాయకులు మైలవరపు రాజేంద్ర ప్రసాద్, మద్దిపాటి ధర్మేంద్ర, బిజెపి రాష్ట్ర గారి వర్గ సభ్యులు కోట రాంబాబు, పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు ముప్పిడి సురేష్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు అడపా రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి చిట్యాల రాంబాబు, పడాల కావ్యరెడ్డి,కార్యదర్శి కసిరెడ్డి నాగదుర్గ,కిసాన్ మోర్చా చెరుకూరి గంగాధర్, ఓబిసి మోర్చా రాష్టకార్యవర్గ సభ్యులు మారిశెట్టి నరసింహమూర్తి,మహిళా మోర్చా అధ్యక్షురాలు గోకా మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి సన్నిధి లక్ష్మి దుర్గ,తుట్టగుంట కృష్ణ కుమారి,కూటమి పార్టీలు నాయకులు, శశి ఇంజినీరింగ్ కళాశాల, వాసవి ఇంజినీరింగ్ కళాశాల, జి ఎం ఆర్, శ్యామల జూనియర్ కళాశాలల విద్యార్థులు భారీ ఎత్తున మువ్వన్నెల జెండాలు చేతబూని వందేమాతరం నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఛత్రపతి శివాజీ సెంటర్ నుంచి శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది.

# గుడివాడ అగ్నిమాపక శాఖకు అదనపు ఫైర్ ఇంజన్ మంజూరు

- డబుల్ యూనిట్ స్టేషన్‌గా ఉన్నా ఇప్పటివరకు ఒక్క వాహనమే ఇప్పుడు 2 వాహనాలు
- ప్రఅసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ ఆంజనేయులు కృషి, ఎమ్మెల్యే రాము చొరవతో ఫలితం



**గుడివాడ, ఆగస్టు 14, నేటి శుభోదయ :**
గుడివాడ అగ్నిమాపక శాఖ కార్యాలయానికి ప్రభుత్వం అదనపు ఫైర్ ఇంజన్‌ను మంజూరు చేసింది. డబుల్ యూనిట్ స్టేషన్‌గా ఉన్న గుడివాడ ఫైర్ స్టేషన్‌లో ఇప్పటివరకు ఒక్క వాహనం మాత్రమే అందుబాటులో ఉండగా, తాజాగా మరో వాహనం కేటాయించడంతో అగ్ని ప్రమాదాల సమయంలో తక్షణమే స్పందించే అవకాశం ఏర్పడింది. ఇటీవల గుడివాడలోని ఆర్కే కాంప్లెక్స్‌లో జరిగిన భారీ అగ్ని ప్రమాదం సమయంలో ఒక్క ఫైర్ ఇంజన్‌తోనే మంటలను అదుపులోకి తెచ్చేందుకు సిబ్బంది తీవ్రంగా ప్రయత్నించారు. అయితే మంటల తీవ్రత అధికంగా ఉండటంతో పరిస్థితి అదుపులోకి రాలేదు. దీంతో గుడివాడ ఫైర్ స్టేషన్ అధికారులు సమీపంలోని హనుమాన్ జంక్షన్, కైకలూరు, పామర్రు అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం అందించారు. ఆయా ప్రాంతాల నుంచి అదనపు వాహనాలు చేరేసరికి భారీగా ఆస్తి నష్టం జరిగింది.ప్రమాద స్థలాన్ని పరిశీలించిన గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము గుడివాడ ఫైర్ స్టేషన్‌లో మరో వాహనం అందుబాటులో ఉండి ఉంటే మంటలను వేగంగా అదుపులోకి తీసుకువచ్చే అవకాశం ఉండేదని గుర్తించారు. ఈ విషయాన్ని అసిస్టెంట్ డిస్టిక్ ఫైర్ ఆఫీసర్ ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే రాము, గుడివాడకు అదనపు ఫైర్ ఇంజన్ మంజూరు చేయించేందుకు ప్రభుత్వ స్థాయిలో ప్రయత్నాలు ప్రారంభించారు.ఫైర్ ఆఫీసర్ ఆంజనేయులు చేసిన కృషి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తీసుకున్న చొరవ ఫలితంగా గుడివాడ అగ్నిమాపక శాఖకు అదనపు వాహనం మంజూరైంది. నూతన వాహనాన్ని త్వరలోనే ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.గుడివాడ అగ్నిమాపక శాఖకు అదనపు వాహనం మంజూరు కావడానికి కృషి చేసిన అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ ఆంజనేయులును, చొరవ తీసుకున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రామును పట్టణ ప్రముఖులు అభినందించారు. అదనపు వాహనం అందుబాటులోకి రావడంతో గుడివాడతో పాటు పరిసర ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు మరింత వేగంగా స్పందించే అవకాశం ఏర్పడనుంది.

# పేదల వైద్యానికి మొదటి ప్రాధాన్యత





**అవనిగడ్డ, ఆగస్టు 14, దమ్మపేట, నేటి శుభోదయ :**
పేదల వైద్యానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శుక్రవారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రీ–ఎంబర్సుమెంట్ చెక్కులు, ఎల్ఓసీ పత్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ 30మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు అయిన రూ.9,49,899లు ఆర్థిక సహాయం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. పేదలు తమ వైద్య అవసరాల కోసం తమ కార్యాలయం ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపే దరఖాస్తులను సీఎం చంద్రబాబు సాధ్యమైనంత వేగంగా పరిష్కరిస్తూ సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటివరకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.13,71,65,226లు ఆర్థిక సహాయం అందించినట్లు వివరించారు. లబ్ధిదారుల తరపున ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రామీణ ఉపాధి, జీవనోపాధి మెరుగుదలే లక్ష్యంగా అందరూ పని చేయాలి

### - మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు రామిశెట్టి





**ముదినేపల్లి, ఆగస్టు 14, నేటి శుభోదయ :**
గ్రామీణ ఉపాధి, జీవనోపాది మెరుగుదలే లక్ష్యంగా అందరూ పనిచేయాలని మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడు రామిశెట్టి సత్యనారాయణ కోరారు. శుక్రవారం ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో వికసిత్ భారత్, గ్రామీణ ఉపాది, జీవనోపాదికి హామీ మిషన్ చట్టం 2025 ప్రతినిధుల సమ్మేళనం ఎన్ని కైన ప్రజాప్రతినిధుల అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని అయన సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల కల్పన, గ్రామీణ ప్రజల జీవనోపాధి మెరుగుదల, గ్రామాల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలు, తదితర అంశాలపై అధికారులు ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు.గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో కీలకమని, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు గ్రామ స్థాయిలో అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కార్యక్రమంలో సూచించారు.ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామీణ ప్రజలకు ఉపాధి, జీవనోపాధి అవకాశాలు మెరుగుపడేలా కృషి చేయాలని అధికారులు సూచించారు.

# రైలు బెర్త్‌లో పోయిన బంగారు ఉంగరం..
## రైల్ మదద్‌తో తిరిగి స్వాధీనం

- గుడివాడ ఆర్‌పీఎఫ్ సిబ్బంది చొరవతో రు.25 వేల విలువైన బంగారు ఉంగరం రికవరీ
- సోషల్ మీడియా ద్వారా ఈ ఘటన అనుభవాన్ని పంచుకున్న... ఎస్ టి యు రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్




**గుడివాడ, ఆగస్టు 14, నేటి శుభోదయ :**
రైలు బేర్తు లో ఈ నెల 12వ తేదీ రాత్రి లింగంపల్లి నుంచి గుడివాడ కు బీదర్ ఎక్స్ ప్రెస్ ట్రైన్ లో ప్రయాణించి ఉ. 5.10 కు గుడివాడ చేరుకుంది. ఉ.9 గం.ల ప్రాంతంలో చేతికి ఉండాల్సిన బంగారు ఉంగరం (సుమారు 2 గ్రా... రు.25 వేలు విలువైన) కనిపించలేదు. అన్ని చోట్లా వెతుకులాట పూర్తి అయిన తర్వాత ఏమీ ఫలితం లేకపోవడంతో ఖచ్చితంగా ట్రైన్ బెర్త్ లోనే పడిపోయి ఉంటుందని అనుకుని 10 గం.ల సమయంలో రైలు మదదు యాప్ లో (యాప్ ఒకటి రెండు సార్లు ఇబ్బంది పెట్టినా) ఫిర్యాదు చేయడం జరిగిందికొద్ది సేపటికి అధికారులు ఫోన్ చేసి వివరాలు తెలుసు కుని ఆ ఫిర్యాదును గుడివాడ ఆర్.పి.ఎఫ్.కు పంపారని,రైలు స్టేషన్ నుంచి శుభ్రం చేయడం కోసం షెడ్ కు వెళ్ళిందని, మా ప్రయత్నం చేస్తామని సిబ్బంది తెలిపారు. సాయంత్రం కూడా అయ్యేసరికిఇక రింగ్ పోయినట్టేనని దొరకదని స్థిర నిర్ణయానికి వచ్చేశాం.సా. 6 గం.ల సమయంలో గుడివాడ (రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్) ఆర్.పి.ఎఫ్. నుండి ఫోన్ కాల్ వచ్చిందని, 'మీ రింగ్ బెర్త్ బెడ్ రోల్స్ (రైల్వే దుప్పట్లు) లో దొరికిందని, వచ్చి తీసుకెళ్ళండి' అని! వెంటనే నమ్మలేకపోయామని అన్నారు. గుడివాడ స్టేషన్ నుండి ఆర్.పి.ఎఫ్. సిబ్బందిమచిలీపట్నం వెళ్ళి ఆ రింగ్ తీసుకువచ్చారు. తర్వాత మేము వెళ్ళి సంబంధిత ఆధారాలు చూపించి ఎంతో సంతోషంతో రింగ్ ను తీసుకున్నాం. పదేళ్ల క్రితం తన అప్రెంటిస్ డబ్బులతో చేయించుకున్న ఉంగరం అది!గుడివాడ ఆర్.పి.ఎఫ్. సిబ్బందికి మనఃపూర్వకంగా ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియచేశారు. గోల్డ్ రింగ్ పోయింది దొరకడం చాలా తక్కువ సందర్భాల్లో జరుగుతుందని, అన్ని చోట్లా సి.సి. టి.వి.లు ఏర్పాటు చేయడం వలన కూడా పోయిన వస్తువుల రికవరీ శాతం పెరుగుతుందని ఆర్.పి.ఎఫ్. సిబ్బంది తెలియచేశారు.ఇది ఎందుకు చెప్తున్నానంటే.ట్రైన్ లో దురదృష్టవశాత్తు ఇలాంటి సంఘటనలు ఎప్పుడైనా జరిగితే తప్పకుండా "రైల్ మదద్" యాప్ లో ఫిర్యాదు చేయడం మర్చిపోకండి.మీ కష్టార్జితాన్ని పొరపాటున పోగొట్టుకుంటే తిరిగి రికవరీ చేయడంలో ఈ యాప్ ఎంతో సహాయం చేస్తుంది. అధికారులు వెంటనే స్పందిస్తున్నారు.

# అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటికి నగరంలో భారీ ఏర్పాట్లు



**తాడేపల్లిగూడెం, ఆగస్టు 14, నేటి శుభోదయ :** తణుకు రూరల్ మండలం ఐతంపూడి గ్రామ మాజీ సర్పంచ్ లావణ్య ఇంటి కూల్చివేత చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని వైఎస్సార్‌సీపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఇంచార్జ్ వడ్డీ రఘురామ నాయుడు అన్నారు. ఐతంపూడి మాజీ సర్పంచ్ లావణ్య కూల్చిన ఇంటిని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు మానుకోవాలని ఒక మాజీ సర్పంచ్ ఇంటిని కూల్చడం దుర్మార్గమని ఆయన అన్నారు. ఇటువంటి కక్షపూరిత పనులు మానుకోకపోతే ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలు బుద్ధి చెప్తాకి సిద్దంగా ఉన్నారని ఆయన అన్నారు. మాజీ సర్పంచ్ లావణ్య వైసీపీకి మద్దతుగా నిలిచినందుకే కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం చేస్తున్నారని ఆయన అన్నారు.ముందస్తు నోటీసులు లేకుండా భారీగా పోలీసులను మోహరించి ఇంటి కూల్చివేతకు పాల్పడటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులను ఇబ్బందులకు గురిచేయడం కూటమి ప్రభుత్వం లక్ష్యం ఇదేనా అని ప్రశ్నించారు. ఇటువంటి రాజకీయ కక్ష సాధింపులను వెంటనే నిలిపివేసి బాధితులకు న్యాయం చెయ్యాలని వారికి సంఘీభావం తెలపడానికి ఇక్కడికి వచ్చానని ఆయన అన్నారు. ఆయన వెంట వైసీపీ నాయకులు కలిశెట్టి తాతారావు,పట్నాల గణపతి, పాలూరి దొరబాబు, లంకా రాజశేఖర్, నల్లిమిల్లి విజయనందరెడ్డి (అంజి), ద్వారపూడి కిరణ్ కుమార్ రెడ్డి, రెడ్డి శ్రీనివాస్, చిట్టూరి బాపన్న, రెడ్డి రమేష్ రెడ్ వైసిపి నాయకులు తదితరులు ఉన్నారు.

# అర్నా స్పోర్ట్స్ అకాడమీలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టులు ప్రారంభం





**గుడివాడ, ఆగస్టు 14, నేటి శుభోదయ :** గుడివాడ పట్టణంలో క్రీడా రంగానికి మరో కొత్త వేదిక అందుబాటులోకి వచ్చింది. నాగవరప్పాడులోని అర్నా స్పోర్ట్స్ అకాడమీలో అంతర్జాతీయ ప్రమాణాలతో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టులు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.మెట్రో నగరాలకు దీటుగా ఆధునిక వసతులతో ఏర్పాటు చేసిన ఈ ఇండోర్ కోర్టులను ఎలక్ట్రికల్ డీఈ శ్రీనివాసరావు, ఐఎంఏ పెద్దలు డాక్టర్ మాగంటి శ్రీనివాస్, ప్రముఖ వైద్యులు డాక్టర్ పొట్లూరి వంశీ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు.గుడివాడ వంటి చిన్న పట్టణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్ అకాడమీని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఈ సందర్భంగా ముఖ్య అతిథులు అన్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.అర్నా స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్ నర్రా విక్రమ్ శ్రీహర్ష మాట్లాడుతూ తాను క్రీడాకారుడిగా ఉన్న సమయంలో సరైన వసతులు లేక, ముఖ్యంగా ఇండోర్ కోర్టు అందుబాటులో లేక రాష్ట్రస్థాయి పోటీల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నానని తెలిపారు. తాను ఎదుర్కొన్న ఇబ్బందులను గుడివాడ, పరిసర ప్రాంతాల క్రీడాకారులు ఎదుర్కోకూడదనే ఉద్దేశంతోనే అంతర్జాతీయ ప్రమాణాలతో ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. క్రీడాకారుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఫోమ్ షీట్‌తో పాటు ప్రపంచస్థాయి కోర్టుల్లో ఉపయోగించే అత్యుత్తమ సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు శ్రీహర్ష వివరించారు.యువతకు మెరుగైన శిక్షణ అందించి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించే క్రీడాకారులను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. కేవలం పోటీ క్రీడాకారులకే కాకుండా ఫిట్‌నెస్ కోసం షటిల్ ఆడాలనుకునే వారికి కూడా అకాడమీ వేదికగా నిలుస్తుందని తెలిపారు.గుడివాడలో క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు ఆధునిక వసతులతో అకాడమీని ఏర్పాటు చేసిన నర్రా శ్రీహర్షను పట్టణ ప్రముఖులు అభినందించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ విశ్వేశ్వరరావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కిరణ్ బాబు, రెడ్డయ్య చౌదరి, నర్రా మాధవ కుమార్, పలువురు పట్టణ ప్రముఖులు క్రీడాకారులు పాల్గొన్నారు.

# గుడివాడలో 'డ్రగ్స్ వద్దు బ్రో.. నో డ్రగ్స్' నినాదంతో భారీ అవగాహన ర్యాలీ

**గుడివాడ, ఆగస్టు 14, నేటి శుభోదయ :**
మాదకద్రవ్యాల మహమ్మారిపై గుడివాడలో సమరశంఖం మోగింది. డ్రగ్స్ వద్దు బ్రో.. నో డ్రగ్స్ అంటూ విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున నినదించారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఈగల్ టీమ్, పోలీస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో గుడివాడ పురవీధుల్లో భారీ స్థాయిలో డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు.ఎన్టీఆర్ స్టేడియం ప్రాంగణంలో ముందుగా నిర్వహించిన అవగాహన సభలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొని మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. డ్రగ్స్ ఒక మహమ్మారి అని, వాటి బారిన పడితే కుటుంబాలు, యువత భవిష్యత్ నాశనం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.డ్రగ్స్‌కు అలవాటు పడిన వారిని శత్రువులుగా చూడకుండా.. వారికి అవగాహన కల్పించి మంచి మార్గంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. స్నేహితులు, పరిచయస్తులు ఎవరైనా మాదకద్రవ్యాలకు అలవాటు పడినట్లు తెలిసినా.. వారి జీవితాన్ని కాపాడేందుకు ఈగల్ టీమ్‌కు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు.గుడివాడలో డ్రగ్స్ రూపురేఖలు లేకుండా నిర్మూలించేందుకు చేస్తున్న పోరాటానికి విద్యార్థులు, యువత ముందుకు రావడం అభినందనీయమన్నారు. నో డ్రగ్స్ అనేది కేవలం నినాదం కాకుండా.. ప్రతి ఒక్కరి ప్రతిజ్ఞ కావాలని ఎమ్మెల్యే రాము పిలుపునిచ్చారు.ఎన్నికల ప్రచార సమయంలో డ్రగ్స్ మత్తులో ఉన్న ఓ యువకుడు దేవుడు పిలుస్తున్నాడు అని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ఎమ్మెల్యే రాము గుర్తుచేశారు. ఇలాంటి ఘటనలు మరెక్కడా జరగకుండా యువతను మాదకద్రవ్యాల నుంచి దూరంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గుడివాడ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ సూచనలను వీడియో రూపంలో తెలియజేయాలని ఎమ్మెల్యే రాము కోరారు. గుడివాడ కోసం ఏం చేయాలనుకుంటున్నారో.. వీలైతే 'ఐ లవ్ యూ గుడివాడ' సెల్ఫీ పాయింట్ వద్ద వీడియో తీసి సోషల్ మీడియాలో అను నేను గుడివాడ హ్యాష్‌ట్యాగ్‌తో పోస్ట్ చేయాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో ఈగల్ హెల్ప్‌లైన్ 1972 నంబర్‌ను పలికించారు.ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ మాట్లాడుతూ గుడివాడలో ఇంత పెద్ద ఎత్తున డ్రగ్స్ వ్యతిరేక కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని ప్రభుత్వం మూడు విభాగాల్లో ముమ్మరంగా అమలు చేస్తోందని తెలిపారు.మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా ఉందని, అందులో భాగంగానే ఈగల్ అనే ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో డ్రగ్స్‌ను నిర్మూలించేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఇతర రాష్ట్రాల నుంచి మాదకద్రవ్యాలు రాష్ట్రంలోకి వచ్చే అవకాశాలను కూడా అడ్డుకుంటున్నామని చెప్పారు.సే నో టు డ్రగ్స్ క్యాంపెయిన్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఐజీ పిలుపునిచ్చారు.ఈగల్ ఎస్పీ జీ. స్వరూప రాణి మాట్లాడుతూ..మాదకద్రవ్యాలను విక్రయించినా, రవాణా చేసినా కఠినమైన చట్టాలు అమల్లో ఉన్నాయని తెలిపారు. ఎన్‌డీపీఎస్ చట్టం కింద తీవ్రమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు.డ్రగ్స్ అత్యంత ప్రమాదకరమైనవని, ప్రపంచవ్యాప్తంగా వాటి వినియోగాన్ని నిషేధించేందుకు చర్యలు జరుగుతున్నాయని చెప్పారు. చదువు, ఉద్యోగాల కోసం మెట్రో నగరాలకు వెళ్తున్న కొందరు యువత సింథటిక్ డ్రగ్స్‌కు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.మాదకద్రవ్యాలపై జరిగిన అనేక దాడుల్లో విద్యార్థులు, ఉద్యోగులు కూడా పట్టుబడి జైలుకు వెళ్లిన ఘటనలు ఉన్నాయని తెలిపారు. విద్య, ఉద్యోగాల కోసం ఎక్కడ ఉన్నా డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని యువతకు సూచించారు.డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ఈగల్ 1972 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని ఈగల్ ఎస్పీ కోరారు. అనంతరం బ్రహ్మకుమారి సంస్థ సభ్యురాలు శైలజ ఆధ్వర్యంలో అధికారులు, విద్యార్థులు, ప్రముఖులతో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం ఎన్టీఆర్ స్టేడియం నుంచి డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ ప్రారంభమైంది. ముందుగా పోలీస్ బ్యాండ్, ఈగల్ టీమ్, పోలీస్ అధికారులు, సిబ్బంది ర్యాలీలో పాల్గొనగా.. వారి వెనుక హోమియోపతి కళాశాలతో పాటు వివిధ కళాశాలల విద్యార్థులు నో డ్రగ్స్.. సే నో టు డ్రగ్స్ అంటూ నినాదాలు చేస్తూ, ప్లకార్డులు పట్టుకొని భారీ సంఖ్యలో పాల్గొన్నారు.ఎన్టీఆర్ స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎజికే




స్కూల్, ఏలూరు రోడ్డు, బొమ్మరిల్లు థియేటర్, నెహ్రూ చౌక్ సెంటర్, మార్కెట్ సెంటర్ మీదుగా సాగి తిరిగి ఎన్టీఆర్ స్టేడియం వద్దకు చేరుకుంది.భారీ ర్యాలీ నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక ట్రాఫిక్ చర్యలు చేపట్టారు. ర్యాలీ జరిగే మార్గాల్లో వాహనాల రాకపోకలను మళ్లించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.కృష్ణాజిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు,ఆర్డీఓ బాలసుబ్రమణ్యం, గుడివాడ డీఎస్పీ పాల శ్రీనివాస్,ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, గుడివాడ జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, బిజెపి నాయకులు దావులూరి సురేంద్రబాబు,సీఐ లు శ్రీనివాస్, హనీష్, ఈగల్ సిఐ రవీంద్ర,స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగ ప్రసాద్, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, మజ్జాడ నాగరాజు, గోకవరపు సునీల్, నిమ్మగడ్డ సత్యసాయి, జిల్లాలోని పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యాశాఖ అధికారులు, హోమియో కళాశాల వైద్యులు, పట్టణంలోని వివిధ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

# మంగినపూడి బీచ్‌లో మహాగణపతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి



**మచిలీపట్నం, ఆగస్టు 14, నేటి శుభోదయ :**
మంగినపూడి బీచ్ సాగర తీరంలో 63 అడుగుల ఎత్తైన మహాగణపతి విగ్రహంతో నిర్వహించనున్న ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు.శుక్రవారం మధ్యాహ్నం మచిలీపట్నంలోని రహదారులు, భవనాల అతిథి గృహంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎం. నవీన్‌తో కలిసి దేవాదాయ, రెవెన్యూ, జిల్లా పంచాయతీ, మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్, గృహ నిర్మాణ, మత్స్య, విద్యుత్, అగ్నిమాపక తదితర శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఉత్సవాల ఏర్పాట్లపై శాఖల వారీగా సమీక్షించి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో మంగినపూడి బీచ్ తీరంలో 63 అడుగుల ఎత్తైన మహాగణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ఇది అత్యంత ఎత్తైన మహాగణపతి విగ్రహంగా నిలవనుందని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్యం, తాగునీరు, పార్కింగ్, భద్రత, నిరంతరాయ విద్యుత్ సరఫరా, అగ్నిమాపక తదితర అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎం. నవీన్ మాట్లాడుతూ భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఈ కార్యక్రమాన్ని సాధారణ పండుగగా కాకుండా పర్యాటక కార్యక్రమంగా భావించి సమగ్ర ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమానికి ముందు, కార్యక్రమం జరిగే సమయంలో, అనంతరం కూడా బీచ్ పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు.మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలు సమన్వయంతో పనిచేస్తూ బీచ్ క్లీనింగ్ డ్రైవ్ తరహాలో ప్రత్యేక పారిశుద్ధ్య బృందాలను ఏర్పాటు చేయాలని, ఉత్సవాలు జరిగే కనీసం ఏడు రోజుల వ్యవధిలో చెత్తను ఎప్పటికప్పుడు సేకరించి తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భక్తుల సంఖ్యకు అనుగుణంగా డస్ట్‌బిన్లు, పారిశుద్ధ్య సిబ్బంది, అవసరమైన వాహనాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు.మహాగణపతి విగ్రహం ఏర్పాటుకు సంబంధించి స్థానిక సంస్థలు, పోలీస్ శాఖతో పాటు అవసరమైన ఇతర శాఖల నుంచి నిబంధనల ప్రకారం అనుమతులు పొందాలని ఇన్‌చార్జి కలెక్టర్ సూచించారు. 63 అడుగుల ఎత్తైన విగ్రహం కావడంతో స్ట్రక్చరల్ స్టెబిలిటీ, నేల సామర్థ్యం, గాలి వేగం వంటి అంశాలను నిపుణుల సూచనల మేరకు పరిశీలించాలని తెలిపారు. ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి నిర్మాణ స్థిరత్వానికి సంబంధించిన సూచనలు, అవసరమైన నివేదికలు తీసుకోవాలని, గాలి వేగం, గాలి దిశకు సంబంధించి సంబంధిత వాతావరణ విభాగం నుంచి ముందస్తు సమాచారం పొందాలని సూచించారు. భద్రత విషయంలో ఎలాంటి చిన్న లోపానికీ అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే నేపథ్యంలో పోలీస్ శాఖ ప్రత్యేక ట్రాఫిక్, రూట్ ప్లాన్ సిద్ధం చేయాలని, అవసరమైన చోట్ల బారికేడింగ్, ట్రాఫిక్ డైవర్షన్, పార్కింగ్ ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని సూచించారు. భక్తుల రాకపోకలకు సంబంధించిన ప్రత్యేక రూట్‌ను కూడా ప్రణాళికలో చేర్చాలని తెలిపారు. క్యూ మేనేజ్‌మెంట్‌లో అవసరమైన చోట్ల కమిటీ సభ్యులు, వాలంటీర సేవలను వినియోగించుకోవాలని, పోలీస్ సిబ్బందిని అత్యవసరంగా అవసరమైన ప్రాంతాల్లోనే వినియోగించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.



ట్రాఫిక్, పోలీస్, ఉత్సవ కమిటీ ప్రతినిధులతో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించి రూట్ ప్లాన్‌ను ఖరారు చేయాలని ఆదేశించారు.భక్తుల సంఖ్యకు అనుగుణంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు అవసరమైన వాహనాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. తాగునీరు, ఇతర మౌలిక వసతులు కూడా భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాటు చేయాలన్నారు.అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్ ఇంజిన్‌ను ముందుగానే సిద్ధంగా ఉంచాలని, హ్యాండ్ ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లను కూడా కీలక ప్రాంతాల్లో అందుబాటులో ఉంచాలని ఇన్‌చార్జి కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాల్లో అగ్నిమాపక భద్రతా చర్యలను ముందుగానే చేపట్టాలని తెలిపారు.పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్యం, చెత్త నిర్వహణ, ప్రజా భద్రత తదితర అంశాల్లో సంబంధిత శాఖలు ముందుగానే తమ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. భారీగా ప్రజలు తరలివచ్చే ఈ కార్యక్రమం అందరి దృష్టిని ఆకర్షించే అవకాశం ఉన్నందున ప్రజా భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఏర్పాటును ముందస్తుగా పరిశీలించాలని అన్నారు.సమావేశంలో బందరు ఆర్డీవో కే సాంబశివరావు, డిపిఓ ఎం ధనలక్ష్మి, జడ్పీ డిప్యూటీ సీఈవో డాక్టర్ ఆనంద్ కుమార్, మత్స్య శాఖ అధికారి అయ్యా నాగరాజా, హౌసింగ్ పీడీ వెంకట్రావు, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ దయాకర్, మచిలీపట్నం నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ నాని, మాజీ మున్సిపల్ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మెహర్ బాబా ప్రసాద్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల మానసిక ఉల్లాసానికి, శారీర దారుఢ్యానికి క్రీడాలు దోహదం చేస్తాయి

**- డిప్యూటీ ఎం. పి. డి. వో. వంగా శ్రీనివాస్**



**పెదపారుపూడి, ఆగస్టు 14, నేటి శుభోదయ :**
విద్యార్థుల మానసిక ఉల్లాసానికి శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదం చేస్తాయని, విద్యార్థులు చదువుతో పాటుగా ఆట పాటల పట్ల అనురక్తిని పెంచుకోవాలని పెదపారుపూడి డిప్యూటీ ఎంపీడీఓ వంగా శ్రీనివాస్ అన్నారు. 80 వ స్వాతంత్ర్య దినోత్సవం ను పురస్కరించుకొని మండలంలోని గుర్విందగుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల యందు వివిధ క్రీడాంశములపై జరిపిన పోటీలను డిప్యూటీ ఎంపీడీఓ తిలకించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరుగుపందెం, లెమన్&స్పూన్, గోనె సంచుల ఆట, కుంటాట, కప్ప గంతులు, కుర్చీలాట లు నిర్వహించడం జరిగింది. రేపు పాఠశాల లో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేయడం జరుగుతుందని ప్రధానోపాధ్యాయులు వై. సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సహ ఉపాధ్యాయని మాధవి, తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు..!



**వెల్దుర్తి, ఆగస్టు 14, నేటి శుభోదయ :**
మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శుక్రవారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. అక్కడున్న మౌలిక వసతులు, భోజనశాల, తాగునీరు, పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. బోధనాపరమైన ఇబ్బందులను విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.ఉపాధ్యాయుల కొరతను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా పరిషత్తు హైస్కూల్ నందు నూతనంగా ఏర్పాటు చేస్తున్న మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాల నిర్మాణాలను పరిశీలించారు. మౌలిక సదుపాయాల కల్పన వంటి పనులను సమీక్షించారు. ఆయన వెంట కూటమి పార్టీల నాయకులు ఉన్నారు.

## శ్రావణ మాస మొదటి శుక్రవారం శ్రీ జగన్మాత సన్నిధిలో భక్తుల రద్దీ



**విజయవాడ, ఆగస్టు 14, నేటి శుభోదయ :**
ఇంద్రకీలాద్రిపై వెలిసిన శ్రీ దుర్గమల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శ్రావణ మాస మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రావణ మాసం మొదటి శుక్రవారం కావడంతో తెలుగు రాష్ట్రాల నలుమూలల నుండి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారి దర్శనం కోసం భక్తులు క్యూ లైన్లలో వేచి ఉండి, కనకదుర్గమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ప్రత్యేక పూలతో ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ముఖ్యంగా అమ్మవారి మూలవిరాట్, ఉపాలయాలు, అంతరాలయాలను రంగురంగుల సుగంధభరితమైన పుష్పాలతో ప్రత్యేక పూల అలంకరణ చేశారు. ఈ అద్భుతమైన పూల అలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుని, ఆలయానికి ఒక ప్రత్యేక శోభను తీసుకువచ్చింది.వైభవంగా ప్రత్యేక కుంకుమార్చనలు, ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన ఈ పూజల్లో పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. తమ సౌభాగ్యం కోసం, కుటుంబ క్షేమం కోసం భక్తులు భక్తిశ్రద్ధలతో ఈ అర్చనలు చేసుకున్నారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలతో ఇంద్రకీలాద్రి కొండ ఆధ్యాత్మిక శోభతో విరసిల్లింది.ఆలయ ఈఓ సీనా నాయక్ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో, స్కానింగ్ పాయింట్ల వద్ద భక్తులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. లైన్లు త్వరగా కదిలేలా సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు.క్యూ లైన్లలో ఉన్న భక్తులకు మొబైల్ మంచినీరు, పాలు వంటి కనీస వసతులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నారు.అధికారులు, అర్చకులు, భద్రతా సిబ్బంది సమన్వయంతో భక్తులందరికీ అమ్మవారి దర్శనం ప్రశాంతంగా, సులువుగా లభించింది.

## వరుణ యాగ ప్రత్యేక పూజలు ప్రారంభం



**విజయవాడ, ఆగస్టు 14, నేటి శుభోదయ :**
రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను నివారించి, సకాలంలో సమృద్ధిగా వరాలు కురవాలని, నదులు, చెరువులు, జలాశయాలు నిండి రైతాంగం సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం ఉదయం దీక్షాపూర్వకంగా వరుణ యాగం సంబందించిన పూజలు ప్రారంభం అయ్యాయి. ఉదయం 06:15 నుండి శ్రీ దుర్గాస్నానఘాట్లో విఘ్నేశ్వర పూజతో వరుణ యాగ పూజా కార్యక్రమములు ప్రారంభం కాగా ప్రత్యేక పూజల్లో ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ,ఈవో వికె శీనా నాయక్ పాల్గొన్నారు. ఆలయ స్థానాచార్య శివ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో పండితులు వరుణ అనువాక సహిత కారక పారాయణలు నిర్వహించారు. ఈ పారాయణలు కొరకు పండితుల బృందం పవిత్ర కృష్ణానదిలో నడుంలోతు నీళ్లలో ఉండి సకాలంలో వర్షాలు పడాలని పారాయణం చేసారు.

# ఆన్ లైన్ ఓటింగ్ తో డ్రామాలు ఆడుతావా

- లాడ్జ్, హోటల్లో కూర్చొని ఓటింగ్ సిస్టం పెడితే ఎవరు ఒప్పుకుంటారు
- 8 ఏళ్లలో అధ్యక్షునిగా ఉంటూ కులం పేరుతో డబ్బులు వసూలు చేశావు
- కర్నూల్లో 14 సంఘాలు ఉన్నాయి



**అనంతపురం, ఆగస్టు 14, నేటి శుభోదయ :** ఆన్లైన్ ఓటింగ్ పేరుతో కురుబ కులాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారు, కులం పేరుతో కొంతమంది కురుబ కులస్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ అక్రమంగా కోట్ల రూపాయలు సంపాదించుకుంటున్నారు. గత 30 సంవత్సరాల నుంచి ముగ్గురు వ్యక్తులు 30 సంవత్సరాలు జిల్లా అధ్యక్షులుగా రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్నారు. 17 సంవత్సరాలు పాటు రాష్ట్ర అధ్యక్షులుగా జబ్బల శ్రీనివాసులు కులం పేరు చెప్పుకొని కోట్లు సంపాదిస్తున్నారని ఇది సమంజసం కాదని కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ కె మల్లికార్జున విమర్శించారు. అనంతపురం నగరంలోని ఆర్ అండ్ బి అతి గృహంలో కురుబ జిల్లా అధ్యక్షులు దొనస్వామితో కలిసి ఎస్ కె మల్లికార్జున విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ కె మల్లికార్జున మాట్లాడుతూ 2026 ఏప్రిల్ ఐదో తారీఖున కురుబ ప్రజా ప్రతినిధులు , బిజెపి, సిపిఐ, వైసిపి టిడిపి పార్టీల వారు కర్నూలు జిల్లాలో కర్నూలు నగరంలో కురుబ మహాసభలో తనను కురుబసంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్నుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని జిల్లాలలో, నియోజకవర్గాలలో మండలాల్లో, పంచాయతీలలో కురుబ కమిటీలు ఎన్నుకోవడం జరిగిందన్నారు. రెండు జిల్లాల మినహా రాష్ట్రంలోని పలు జిల్లాలో కమిటీలు వేయడం జరిగిందన్నారు. ఈనెల 8 తేదీన అనంతపురం నగరంలోని గుత్తి రోడ్ లో ఉన్న కనక దాస కళ్యాణమండపంలో కురుబ కులస్తుల ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షున్ని, ప్రధాన కార్యదర్శిని, జిల్లా ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులుగా కళ్యాణ్ దుర్గం కు చెందిన దొనస్వామిని జిల్లా అధ్యక్షులుగా ఎన్నుకోవడం జరిగిందన్నారు . గతంలో గోపీనాథ్, పావురాల కృష్ణ, రాగే పరుశురాం, లింగమూర్తి, రాజహంస శ్రీనివాసులు జిల్లా అధ్యక్షులుగా పనిచేయడం జరిగిందన్నారు. 8 సంవత్సరాలు అధ్యక్షునిగా ఉన్న ఆయన వాట్సాప్ లో సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తూ, లాడ్జిల్లో హోటలలో ఓటింగ్ సిస్టం పెట్టడం జరిగిందని ఇన్నేళ్ల కాలంలో ఎప్పుడు ఆన్లైన్ సిస్టం ఏర్పాటు చేయలేదన్నారు. తాను రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న పేరును జిల్లా అధ్యక్షుల పోటీలో ఉన్నారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయనకు 3 వేల ఓట్లు వచ్చాయని తనకు 750 ఓట్లు వచ్చాయని బోరంపల్లి ఆంజనేయులుకు 150 ఓట్లు వేశారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సత్య సాయి జిల్లాకు చెందిన సామ కోటి ఆదినారాయణ, రాజహంస శ్రీనివాసులు తమంతకు తామే అధ్యక్షులుగా ప్రకటించుకోవడం జరిగిందన్నారు.సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారన్నారు. ఇది సమంజసం కాదని ఇలా చేస్తే వీరిపై కోర్టులో పిటిషన్లు వేయడం జరుగుతోందన్నారు.కురుబ సంఘానికి ఎంపీ పార్థసారథి కోటి రూపాయలుఅనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ 50 లక్షల రూపాయలు కురవ సంఘం అభివృద్ధి కార్యక్రమాలకు ఇస్తామని ప్రకటించడం జరిగిందన్నారు. కురబ సంఘం జిల్లా అధ్యక్షులు దొన స్వామి మాట్లాడుతూ ఒకే కులం, ఒకే సంఘం పేరుతో కొంతమంది కు రువలను మభ్య పెట్టడం జరుగుతోందన్నారు. గతంలో 17 సంవత్సరాలు పాటు జబ్బల శ్రీనివాసులు రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్నారని జిల్లాలో ఎనిమిది సంవత్సరాలు రాజహంస శ్రీనివాసులు అధ్యక్షులుగా ఉన్నారని కళ్యాణ మండపం అధ్యక్షునిగా, జిల్లా అధ్యక్షులుగా పనిచేశారన్నారు . లింగమూర్తిని డమ్మీ అధ్యక్షులుగా ఉండడం పెత్తనమంతా రాజహంస శ్రీనివాసులే చేశారని ఎద్దేవ చేశారు. అనంతపురం ఉమ్మడి జిల్లాలో గతంలో మాజీమంత్రి ఉషమ్మ, మాల గుండ్ల శంకర్ నారాయణ , గోరంట్ల మాధవ్ లను వారి ఆధ్వర్యంలో కురువ సంఘం కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిపామని గుర్తు చేశారు. ఇటీవల కనకదాస కళ్యాణ మండపంలో కూడా కనగదాస విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగిందన్నారు. ఫ్లెక్సీలలో కూడా మాజీ మంత్రులు ఉషమ్మ, శంకర్ నారాయణ, గోరంట్ల మాధవ్ , కేటీ శ్రీధర్ , జగదీష్ వారి ఫోటోలను ఫ్లెక్సీలలోవేయడంతో పాటు ప్రస్తుత మంత్రి సవిత పార్థసారథి ఫోటోలను కూడా ప్రచురించడం జరిగిందన్నారు. కురువ సంఘం అధ్యక్షులు అని చెప్పుకుంటున్న రాజహంస శ్రీనివాస్ బిల్డింగ్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం ఉపాధ్యక్షులు గవ్వల రామకృష్ణ, కురువ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నీళ్ల పాల రాజగోపాల్, కురువ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ బిల్లె మంజునాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, యువజన సంఘం జిల్లా అధ్యక్షులు బండి బాలు, కురుబ సంఘం నాయకులు ఉమేష్ గౌడ్, చిరుతల ఆనంద్, ఆవుల రామచంద్ర, నరేంద్ర, రమణ తదితరులు పాల్గొన్నారు

# బీ.టెక్ విద్యార్థులకు 'బేసిక్ స్కిల్స్ ఇన్ ఇంజినీరింగ్'పై వర్క్‌షాప్




**మాచర్ల, ఆగస్టు 14, నేటి శుభోదయ :** బీ.టెక్ విద్యార్థులకు "ఇంజినీరింగ్లో ప్రాథమిక నైపుణ్యాలు" అంశంపై ఒకరోజు వర్క్ షాప్ నిర్వహణమాచర్ల మండలం అలుగురాజుపల్లిలోని న్యూటన్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో బీ.టెక్ విద్యార్థుల కోసం "ఇంజినీరింగ్లో ప్రాథమిక నైపుణ్యాలు" అనే అంశంపై ఒకరోజు వర్క్ షాపు నిర్వహించారు.కాకినాడకు చెందిన వరాప్కు జవహర్లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, ప్రొఫెసర్ డా. కె.వి.ఎస్.జి. మురళీ కృష్ణ రిసోర్స్ పర్సన్ గా హాజరై విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్యలో అవసరమైన ప్రాథమిక నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, సమస్య పరిష్కార విదానాలు, వత్తిడి నిర్వహణ మరియు ప్రస్తుత పారిశ్రామిక అవసరాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డా. మురళీకృష్ణ మాట్లాడుతూ, ఇంజినీరింగ్ విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా సాంకేతిక నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, సమస్య పరిష్కార సామర్థ్యం, సృజనాత్మక ఆలోచన, బృందపని వంటి నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ప్రాథమిక ఇంజినీరింగ్ నైపుణ్యాలు ఎంతో కీలకమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ జున్నా శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ జున్నా చక్రధర్ రెడ్డి, ప్రిన్సిపాల్, యస్. నరసింహారావు, వైస్ ప్రిన్సిపాల్, బి. నరసింహారావు, ఏ.ఓ. ఖాసిం తదితరులు పాల్గొన్నారు. కళాశాల అధ్యాపకులు, బీ.టెక్ విద్యార్థులు వర్క్ షాప్ లో ఉత్సాహంగా పాల్గొని నిపుణుల సూచనలు, సలహాలను స్వీకరించారు. విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని, నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇటువంటి వర్క్ షాప్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని కళాశాల యాజమాన్యం పేర్కొంది.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు ఉండరాదు



**విజయవాడ, ఆగస్టు 14, నేటి శుభోదయ :** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం ఉదయం నగర పర్యటనలో భాగంగా సీతమ్మ వారి పాదాలు, ప్రకాశం బ్యారేజ్, తుమ్మలపల్లి కళాక్షేత్రం, గవర్నర్‌పేట, ముత్యాలంపాడు, సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో జిల్లా స్థాయిలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్న నేపథ్యంలో విజయవాడ నగరపాలక సంస్థ చేపడుతున్న ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు ఉండరాదని కమిషనర్ అధికారులను ఆదేశించారు.వేడుకలకు హాజరయ్యే ప్రజలు, అధికారులు, సిబ్బందికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీటి సౌకర్యం, తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణ వంటి ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. అదేవిధంగా పరేడ్ నిర్వహణకు అనువుగా గ్రౌండ్ లెవలింగ్ పనులను పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.శాఖాధిపతులు తమకు అప్పగించిన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు.ఈ పర్యటనలో జోనల్ కమిషనర్లు ఎన్. శ్రీనివాస్, కె. ప్రభుదాస్, కె. షమ్మీ, చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ గోపాల నాయక్, సూపరింటెండింగ్ ఇంజనీర్ దుష్యంత్, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపాలకృష్ణమూర్తి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, ఆర్ఎఫ్ఓ సిహెచ్. రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి దోమల వల్ల కలిగే వ్యాధులను నిర్మూలిద్దాం



**విజయవాడ, ఆగస్టు 14, నేటి శుభోదయ :** విజయవాడ నగరంలో దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులను సమర్థవంతంగా నివారించేందుకు ప్రతి ఇంటిలో ప్రతి శుక్రవారం డ్రై డేను తప్పనిసరిగా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సూర్యకుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం బృందావన కాలనీ, లబ్బీపేట పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు దోమల నివారణపై సూచనలు అందించారు.ఈ సందర్భంగా బయాలజిస్ట్ సూర్యకుమార్ మాట్లాడుతూ నగరంలో దోమల ఉత్పత్తిని అరికట్టేందుకు విజయవాడ నగరపాలక సంస్థ శాస్త్రీయ పద్ధతుల్లో విస్తృత చర్యలు చేపడుతోందన్నారు. ప్రధాన కాలువల్లో పూడిక తొలగింపు చేపట్టి ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా నిరంతర చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ట్రాక్టర్ ఆధారిత ప్రత్యేక యంత్రాలు, బోట్ల సహాయంతో కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కలు, చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలను తొలగిస్తున్నామని చెప్పారు.సిబ్బంది చేరుకోలేని ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేసి దోమల లార్వా పెరగకుండా నివారణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిరంతరం ఫాగింగ్, యాంటీ లార్వల్ స్ప్రేయింగ్ నిర్వహించడంతో పాటు, దోమల లార్వాను ఆహారంగా తీసుకునే గాంబూసియా చేపలను నీటి వనరుల్లో విడిచిపెట్టి జీవసంబంధిత పద్ధతులను కూడా అమలు చేస్తున్నామని వివరించారు.నగరపాలక సంస్థ చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో వారానికి ఒకరోజు, ముఖ్యంగా ప్రతి శుక్రవారం 'డ్రై డే'గా పాటించి, ఇంటి లోపల, బయట, డాబాపై మరియు పరిసర ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.వాడుకలో లేని బకెట్లు, మగ్గులు, తొట్లు, డ్రమ్ములు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, టైర్లు, కూలర్లు, ఫ్రిజ్ ట్రేలు, నీటి నిల్వ ఉండే ఇతర పాత్రలను ప్రతి శుక్రవారం తప్పనిసరిగా పరిశీలించి వాటిలోని నీటిని పూర్తిగా పారబోయాలని సూచించారు. కేవలం ఐదు నుంచి ఏడు రోజుల పాటు నిల్వ ఉన్న నీటిలోనే దోమల లార్వా వేగంగా అభివృద్ధి చెందుతుందని, అందువల్ల వారానికి ఒకసారి నీటి నిల్వలను తొలగించడం ద్వారా దోమల ఉత్పత్తిని గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు.అవగాహన కార్యక్రమంలో భాగంగా అధికారులు ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి ప్రజలకు ప్రత్యక్షంగా చూపిస్తూ, వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం ద్వారా దోమల వ్యాప్తిని శాశ్వతంగా నియంత్రించవచ్చని వివరించారు. పరిశుభ్రమైన పరిసరాలు, ప్రజల అప్రమత్తత, నగరపాలక సంస్థ చర్యలు కలిసివస్తేనే దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను పూర్తిగా నియంత్రించగలమని తెలిపారు.ఈ కార్యక్రమంలో బయాలజిస్ట్ తో పాటు యు పి హెచ్ సి డాక్టర్ కె.భార్గవి, హెల్త్ సూపర్ వైజర్ శ్రీనివాస్,శానిటరీ ఇన్స్పెక్టర్లు, మలేరియా విభాగం సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .

## దుర్గగుడి అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీ కేశినేని చిన్ని



**విజయవాడ, ఆగస్టు 14, నేటి శుభోదయ :** బెజవాడ శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయ పరిధిలో శరవేగంగా జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) శుక్రవారం పరిశీలించారు. ఆలయ ఈఓ సీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ట్రస్ట్ బోర్డు సభ్యులతో కలిసి ఆయన పర్యటించారు.ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న నూతన అన్నదానం భవనం, ప్రసాదం పొట్టు (తయారీ) భవన నిర్మాణ పనులను వారు నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యత, అందుబాటులోకి రానున్న వసతులపై ఎంపీ చిన్ని సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల నాటికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా అన్నదాన భవనం, ప్రసాదం తయారీ కేంద్రాల నిర్మాణాలు పూర్తి కావడం సంతోషకరమన్నారు.ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈఓ సీనా నాయక్ మాట్లాడుతూ దుర్గమ్మను దర్శించుకునే భక్తులకు మెరుగైన సేవలందించడమే తమ లక్ష్యమని, మిగిలిన పనులను కూడా త్వరలోనే పూర్తి చేసి ఈ భవనాలను వైభవంగా ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు

## 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం




**విజయవాడ, ఆగస్టు 14, నేటి శుభోదయ :** ఏలూరు రోడ్డు లోని విజయ టాకీస్ సిగ్నల్ వద్ద నుండి 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించిన "ఘర్ ఘర్ తిరంగా – హర్ ఘర్ తిరంగా" తిరంగా ర్యాలీలో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు, ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలతో ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటాలని పిలుపునిచ్చారు.కులాలు, మతాలు, భాషలు వేరైనా మనమంతా భారతీయులుగా ఒక్కటై స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని కోరారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం, వారికి ఘన నివాళులు అర్పించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి జిల్లాకు ఒక మంత్రిని ఇన్‌చార్జ్‌గా నియమించి, ప్రజల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని మరింతగా పెంపొందించేలా ప్రభుత్వం కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా నారా లోకేష్ నేటి ఉదయం 8:40 గంటలకు మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారని తెలిపారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఉమా కోరారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.భారత్ మాతాకీ జై!వందేమాతరం! ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, బీజేపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షురాలు బొమ్మ దేవర రత్నకుమారి, బీజేపీ నాయకులు నామిశెట్టి వెంకట్, బొమ్మ దేవర శ్రీనివాస్, స్కూల్ విద్యార్థులు, కాలేజీల విద్యార్థులు, స్థానికులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సెంట్రల్ నియోజకవర్గ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం, సెంట్రల్ అభివృద్ధికి బొండా ఉమా కృషి అభినందనీయం - ఎంపీ కేశినేని చిన్ని



**విజయవాడ, ఆగస్టు 14, నేటి శుభోదయ :** సెంట్రల్ నియోజకవర్గ ప్రజల దీర్ఘకాలిక తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అమృత్ 2.0 పథకంలో భాగంగా 59వ డివిజన్ అజిత్‌సింగ్ నగర్ వాంబే కాలనీ, ఐకానిక్ పార్క్ వెనుక నూతన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొని శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.విజయవాడ కృష్ణా నది ఒడ్డున ఉన్నప్పటికీ గతంలో పరిమిత సమయాల్లోనే నీటి సరఫరా జరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రజలు తనను, ఎంపీ కేశినేని చిన్ని ని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని, మంత్రులను కలిసిన ప్రతిసారి నీటి సరఫరా సమయాన్ని పెంచాలని కోరేవారని గుర్తుచేశారు.ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఎంపీ కేశినేని చిన్ని సహకారంతో భారీ తాగునీటి ప్రాజెక్టులను చేపడుతున్నామని తెలిపారు.నూతన ప్లాంట్ పూర్తయితే సెంట్రల్ నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో నీటి సరఫరా మరింత మెరుగుపడి, తాగునీటి ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయని ఉమా పేర్కొన్నారు. పనులను వేగవంతంగా పూర్తి చేసి వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సెంట్రల్ నియోజకవర్గ అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు మరో కీలక మైలురాయి అని ఎమ్మెల్యే అన్నారు.ఎంపీ చిన్ని మాట్లాడుతూ ఎమ్మెల్యే ఉమా ఆధ్వర్యంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో గత రెండేళ్లుగా అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి ఉమా పెద్దపీట వేస్తున్నారని అన్నారు.సెంట్రల్ ప్రజల మంచినీటి అవసరాలను తీర్చేందుకు చేపడుతున్న ఈ భారీ ప్రాజెక్టు పూర్తయితే ప్రజలకు మరింత మెరుగైన తాగునీటి సరఫరా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. బొండా ఉమా చొరవ, పట్టుదలతో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్న నాయకత్వంతో సెంట్రల్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని కేశినేని చిన్ని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో VMC SE దుష్యంత్, VMC EE గోపాలకృష్ణ, VMC DEE సింధూర, గొట్టుముక్కల రఘురామ రాజు, మేఘా AVP ఎం. పాండ్యన్, మేనేజర్ జి.వి. రామ్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ ఎం. వెంకట నాగు, సెంట్రల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ నవనీతం సాంబశివరావు, రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి దాసరి ఉదయశ్రీ, సెంట్రల్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పైడి తులసి, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి Sk గౌసియా, సెక్రటరీ దొండపాటి సుల్తానా, డివిజన్ అధ్యక్షులు రాజా నా బంగారు నాయుడు, బుదాల సురేష్, Sk జాన్ వలి, Sk ఫర్వీన్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మాచర్ల కోర్టు ఆవరణలో మొక్కలు నాటిన న్యాయమూర్తులు



**అమరావతి, ఆగష్టు 9, నేటి శుభోదయ :** ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లిన గుడివాడ మున్సిపాలిటీ మాజీ జూనియర్ అసిస్టెంట్ జి. సునీల్బాబు సెలవు దరఖాస్తును ప్రాసెస్ చేయలేదనే ఆరోప ణల నేపథ్యంలో పలువురు సిబ్బందిపై శాఖాపరమైన చర్యలకు ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ మేనేజర్ టి.ఎల్.వి.ఎస్. ప్రసాద్, మాజీ సీనియర్ అసిస్టెంట్లు వి.రామకృష్ణ, అల్లాడ వెంక టేశ్వరరావు, కె.ఎస్.ప్రసాద్, రికార్డ్ అసిస్టెంట్ ఆర్.చిన్నా తదితరులపై శాఖాపరమైన చర్యలకు ఆదేశిస్తూ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. గుడివాడ మున్సిపాలిటీ మాజీ మేనేజర్లు ఎన్.ఎ.వి.ఎస్.ప్రసాద్, కె.వసంతలక్ష్మిపై వచ్చిన అభియోగాల నేపథ్యంలో శాఖాపరమైన చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## హెచ్.ఐ.వి వ్యాధిపై అవగాహన కల్పించాలి

**- డి ఎం అండ్ హెచ్ ఓ కట్టా వెంకటేశ్వర్లు**



**అనంత పురం బ్యూరో, ఆగస్టు 14, నేటి శుభోదయ :** హెచ్ఐవి వ్యాధి నిర్మూలించడంలో, నియంత్రించడంలో అవగాహన ముఖ్యమైన అంశమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారంఆంధ్ర ప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి తరపున హెచ్ఐవి పై అవగాహన కల్పించేందుకు ఏర్పాటుచేసిన ప్రచార వాహనాన్ని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్.ఐ.వి/ ఎయిడ్స్ మరియు సుఖవ్యాధుల పట్ల అవగాహన కల్పించేందుకు జిల్లాలో రెండు నెలల పాటు స్కూళ్లు, కాలేజీలు, గ్రామాలలో విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈ ప్రచార వాహనాన్ని వినియోగించనున్నట్లు చెప్పారు . ఈ విస్తృత అవగాహనా కార్యక్రమాలలో భాగంగా ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి వారు పంపిన ఎల్ఈడి ప్రదర్శన కలిగిన ఈ వాహనం అత్యాధునికంగా అమర్చడం జరిగిందని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా లెప్రసి, ఎయిడ్స్ మరియు క్షయ నియంత్రణ అధికారి డా. జయలక్ష్మి మాట్లాడుతూ ఎల్ఈడి వాహనం వద్ద క్యూ ఆర్ ఆర్ కోడ్ ను ప్రదర్శించటం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ ఆ క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేసి అందులో కొన్ని ప్రశ్నలకు సమాధానం ఇవ్వటం ద్వారా హెచ్.ఐ.వి. సోకే ప్రమాదాన్ని అంచనా వేసుకోవచ్చని, ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని తెలిపారు. అవసరమైన వారికి అక్కడే హెచ్ఐవి పరీక్షలు నిర్వహించేందుకు కూడా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం, సూపర్వైజర్ జీవి రమణ, CPO ఈవీ రమణ, నారాయణస్వామి, ప్రాజెక్టు మేనేజర్ నరేష్ బాబు, సురేష్, ప్రివెన్షన్ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రాచీన వైద్యంలో ఆయుర్వేదిక వైద్యం సాటిలేనిది

## - పుట్టపర్తి ఎంఎల్ఏ పల్లె సింధూర రెడ్డి

### పుట్టపర్తిలో సాయి గోకుల్ ఆయుర్వేదిక్ మెడికల్ స్టోర్ ను ప్రారంభించిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె



**అనంత పురం బ్యూరో, ఆగస్టు 14, నేటి శుభోదయ :** పుట్టపర్తి పట్టణంలో సాయి గోకుల్ ఆయుర్వేదిక్ మెడికల్ స్టోర్ను పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి, టీడీపీ పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన ఆయుర్వేద వైద్య సేవలు, ఆయుర్వేద మందులు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. మన ప్రాచీన ఆయుర్వేద వైద్య విధానంపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్య సంరక్షణలో ఆయుర్వేదం అందిస్తున్న సేవలు ఎంతో ప్రాధాన్యత కలిగినవని పేర్కొన్నారు.మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ.. పుట్టపర్తిలో ప్రజలకు అవసరమైన వైద్య సేవలు, ఆరోగ్య ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా నూతన సంస్థలు ఏర్పాటు కావడం సంతోషకరమన్నారు. సాయి గోకుల్ ఆయుర్వేదిక్ మెడికల్ స్టోర్ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.అనంతరం స్టోర్ నిర్వాహకులు లోచర్ల విజయభాస్కర్ రెడ్డి , డాక్టర్ యుగాంధర్ , హరినాథ్ లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గంగాధర్ నాయుడు, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు,స్టోర్ నిర్వాహకులు,వైద్యులు అభిమానులు తదితరులు తెలిపారు.








# వందేమాతర గర్వంతో ఎగిసిపడిన త్రివర్ణజెండా..!

- నిండుకున్న దేశభక్తితో విద్రోహాన్ని తరిమికొట్టాలి..!
- తిరంగ్ ర్యాలీలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



**మాచర్ల, ఆగస్టు 14, నేటి శుభోదయ :** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురష్కరించుకుని వందేమాతర గర్వంతో ఎగిసిపడిన త్రివర్ణ జెండా పురవీధుల్లో రెపరెపలాడింది. శుక్రవారం విద్యా సంస్థలు, NGOలు, యువత, అధికారులు, కూటమి పార్టీల శ్రేణులు సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రింగ్ రోడ్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు తలపెట్టిన హర్ ఘర్ తిరంగ్ ర్యాలీలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ముందుకు స్థానిక రింగ్ రోడ్డు నుంచి 1000 మీటర్ల భారీ జాతీయ జెండాతో విద్యార్థులు కదిలిరాగా.., తిరంగ్ జెండాలను చేతపట్టిన జనం భారత్ మాతాకీ జై అంటూ ముందుకు అడుగులు వేశారు. ఒకవైపు ఉవ్వెత్తున ఉప్పొంగిన దేశభక్తి.., మరోవైపు సందడిగా జయహో అంటూ దేశభక్తి గేయాల డీజే మోతలు, యువత బైక్ ర్యాలీ నడుమ వడ్డె ఓబన్న విగ్రహం, అంబేద్కర్ సెంటర్ మీదిగా ర్యాలీ బస్టాండ్ సెంటర్ వరకు సాగింది. జాతీయ పితా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం బస్టాండ్ సర్కిల్ లో విద్యార్థులతో మనవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.., 80 ఏళ్ళ స్వతంత్ర భారతంలో విభిన్న సంస్కృతులు, సాంప్రదాయాలకు పుట్టినిల్లుగా ఉన్నప్పటికీ కులాలు, మతాలకు అతీతంగా దేశ సమగ్రతకు కట్టుబడి కలిసిమెలసి ఉంటున్నామన్నారు. స్వదేశంలోనే ఉంటూ కుటిల రాజకీయంతో దేశద్రోహులుగా మారి ప్రతిష్టతను దెబ్బతీసేలా కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. నిరసనలు పేరుతో ఢిల్లీలో కాక్రోచ్, కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న రాద్దాంతం ప్రజలు చీదరించుకుంటున్నారని విమర్శించారు. భారత కీర్తి పతాకాన్ని ప్రపంచ నలు మూలలు చాటి చెప్పేందుకు 12 ఏళ్లుగా ప్రధాని మోదీ అహర్నిశలు పాటుపడుతున్నారని చెప్పారు. ప్రపంచ దేశాలకు ధీటుగా విద్యా, విజ్ఞానం, సాంకేతిక రంగాల్లో తనదైన ముద్రవేసుకుంటూ కూటమి ప్రభుత్వం దేశాన్ని వినూత్నంగా ముందుకు తీసుకుపోతోందని ఉద్ఘాటించారు. భారత దేశం అన్నీ రంగాల్లో పోటీపడుతూ.., శత్రుదేశాలకు అందని స్థాయిలో పురోగమిస్తోంది వివరించారు. యువత నిండుకున్న దేశ భక్తితో అప్రమత్తంగా ఉండి సరిహద్దుకు అవతల ఉన్న శత్రువులతో, స్వదేశీ విద్రోహులతో పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ గబ్రూనాయక్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు,తహశీల్దార్ కిరణ్ కుమార్, కూటమి పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.

# దేశభక్తి , జాతీయ సమైక్యతను పెంపొందించడమే లక్ష్యం..

## - హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ను విజయవంతం చేయాలి

### డిఆర్ఓ ఎ. మాలోల అనంత లో భారీ ఎత్తున జరిగిన ర్యాలీలో రెపరెప లాడిన త్రివర్ణ పతాకం




**అనంతపురం బ్యూరో, ఆగస్టు 14, నేటి శుభోదయ :** "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం జిల్లా ప్రభుత్వ యంత్రాంగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భారీగా నిర్వహించిన ర్యాలీ ప్రజలకు ఎంతో స్ఫూర్తినిచ్చి దేశభక్తిని చాటుకుంది.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాలోల ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండా ను ఆవిష్కరించి, ర్యాలీని ప్రారంభించారు. ఆర్ట్స్ కాలేజీ నుండి ప్రారంభమైన ఈ భారీ ప్రదర్శన ర్యాలీ లో 80 అడుగుల పొడవైన జాతీయ పతాకాన్ని విద్యార్థులు ,అధికారులు, ఉపాధ్యాయులు , యువతీ యువకులు,స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు,ప్రభుత్వఉద్యోగులు, స్వచ్ఛంద సేవాసంస్థలు స్థానిక ప్రజలు, ఎన్ఎస్ఎస్, యన్ సి సి, నర్సింగ్ కాలేజీవిద్యార్థులు , మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగసిబ్బంది, పలువురు క్రీడాకారులు వాకర్స్ తదితరులు అత్యంత భక్తిశ్రద్ధలతో చేత బూని "మేరా భారత్ మహాన్" "వందేమాతరం"భారత్ మాతాకీ జై అంటూ చేసిన నినాదాలు అనంత ప్రధాన వీధులలో దేశభక్తి, జాతీయసమైకృత, సోదర భావం మరియు దేశ ప్రగతి పట్ల సమాజంలో భావం ఉప్పొంగింది. అలాగేకన్నుల పండుగగా జన సందోహం మధ్య ఘనంగా జరిగింది. అంతకు ముందు ఆర్ట్స్ కాలేజీ మైదానంలో అటవీ శాఖఆధ్వర్యంలోఏర్పాటుచేసిన పలు మొక్కలను డిఆర్ఓ నాటారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూఅధికారిమాలోలమాట్లాడుతూ ప్రపంచంలో మన భారత దేశం విభిన్న సంస్కృతి,సాంప్రదాయాలకు నిలయంగా ఉందన్నారు. అలాగే జాతీయ జెండా మన భారతదేశ సార్వ భౌమా ధికారానికిత్యాగానికి జాతీయ సమైకృతకు ప్రతీకగాఉండిమాతృభూమి స్వాతంత్రం కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను స్పందించుకోవడానికి "హర్ ఘర్ తిరంగా " కార్యక్రమం ఒక గొప్ప అవకాశం అని సమాజంలోని ప్రతి ఒక్కరూ దేశభక్తిని మరియు జాతీయ సమైక్యతను పెంపొందించు కోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 80 వ భారత దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై వ్యాపార సముదాయాలపై స్వచ్ఛందంగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిదేశభక్తి స్ఫూర్తిని చేటాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత తరుణంలో ప్రజలు నేటి యువత , విద్యార్థులు జాతీయభావాన్నిమరింతగా అలవర్చుకోవాలని దేశభక్తి ఐక్యతను పెంపొందించ డంతోపాటు జాతీయ జెండాపై పెంచుకోవాలని సూచించారు. ఈ ర్యాలీలో వేలాదిమంది పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి డిఆర్ఓ తన ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్ డి ఓ కుమార్, డీఎఫ్ఓ గురు ప్రభాకర్, జిల్లా టూరిజం అధికారి రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ జస్వంత్ రావు, డీఈవో అయుబ్ హుస్సేన్, బీసీ సంక్షేమ శాఖ అధికారి కుష్బూ కొఠారి , ఐసిడిఎస్ పిడి సాజిదున్నిసా, మెప్మా పిడి విశ్వ జ్యోతి, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మశ్రీ, ఆర్ ఐ ఓ వెంకటరమణ నాయక్ , డి ఐ పి ఆర్ ఓ బాల కొండయ్య, ఆర్కాలజీ ఏడి స్వామి నాయక్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాకర్ సూగప్ప, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి మంజుల, ఆన్ సెట్ మేనేజర్ శ్రీనివాసులు, యూత్ వెల్ఫేర్ అన్వర్ భాష, తదితరులు పాల్గొన్నారు.






NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,“D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .